



# విజయభాను





విశాఖపట్నం, ఆదివారం 26-08-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 326 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# కడపలో ఘనంగా వనం-మనం

- రాయలసీమను రతనాల సీమగా చేస్తాం
- సాంకేతికతను, ప్రకృతిని అనుసంధానం చేసుకోవాలి
- ఉక్కు పరిశ్రమ వచ్చే వరకు పోరాటం సాగిస్తాం
- సీఎం చంద్రబాబు నాయుడు



కడప: కడపకు ఉక్కు పరిశ్రమ వచ్చే వరకు పోరాడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. కేంద్రం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు విశ్రమించేది లేదని తెలిపారు. కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో జరిగిన వనం-మనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రసంగించారు. రాయలసీమను రతనాల సీమగా తయారు చేస్తున్నామని.. ఎక్కడా కరవు లేకుండా చూస్తున్నామని సీఎం అన్నారు. కడపలోని గండికోటకు నీరు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ జలాశయంలో 10 టీఎంసీలు నిల్వ చేస్తామని చెప్పారు. పులివెందులకు నీరు ఇస్తామన్న హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. కడప జిల్లాలో 90 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందన్నారు.

కడపలో కూడా జ్ఞానభేరి కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని తీసుకొస్తామని చంద్రబాబు అన్నారు. సాంకేతికతను, ప్రక ృతిని అనుసంధానం చేసుకోవాలని సూచించారు. అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల్లో ప్రక ృతి సేద్యానికి శ్రీకారం చుట్టినట్లు సీఎం తెలిపారు. రాబోయే తరువాయి 2లో..

## ప్రజలంతా కోలుకోవాలి

- దేశం మొత్తం మీ వెంటే ఉంది!
- కేరళకు రాష్ట్రపతి, ప్రధాని 'ఓనం' శుభాకాంక్షలు



న్యూఢిల్లీ: వర్షాలతో అతలాకుతలమైన కేరళ ప్రజలు వరదల ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నారు. ఆ రాష్ట్రంలో ఏటా జరుపుకొనే ఓనం వేడుకల సందర్భంగా తిరువనంతపురంలోని పద్మనాభస్వామి ఆలయానికి ప్రజలు భారీగా తరలివస్తున్నారు. కేరళ ప్రజలకు ఓనం శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ... వర్షాల బారిన పడి నష్టపోయిన కేరళ వెంటే దేశమంతా ఉందని అన్నారు. 'కేరళ ప్రజలకు ఓనం శుభాకాంక్షలు. వరదల కారణంగా నష్టపోయిన ప్రజలు మళ్లీ కోలుకొని ఈ పండుగతో కొత్త జీవితాన్ని ఆరంభిస్తారని ఆశిస్తున్నాను' అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ట్వీట్ చేశారు.

'కేరళ ప్రజలు కొన్ని రోజులుగా వరదలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఓనం వేడుక కేరళ ప్రజలకు నూతన శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నాను. దేశం మొత్తం కేరళ ప్రజల వెంటే ఉంది. అక్కడి ప్రజలు సంతోషంగా జీవించాలని కోరుకుంటోంది' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ట్విటర్ ఖాతాలో పేర్కొన్నారు.

కాగా, భారత వైమానిక దళాధికారులు తమ తరపున రూ.20 కోట్ల చెక్కును కేరళ ముఖ్యమంత్రికి అందించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం ట్విటర్‌లో 'వరద బాధిత ప్రాంతాల్లో ఇప్పటి వరకు 1,31,683 ఇళ్లను తరువాయి 2లో..

# వేడెక్కిన ఎన్నికల వాతావరణం

## పవన్‌తో చర్చలు .. ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో మేనిఫెస్టో

## 20 మంది ఎమ్మెల్యేలు జనసేనలోకి!



అమరావతి: తెలంగాణలో ముందస్తు ఎన్నికల ప్రచారం జోరందుకోగా.. ఏపీలోనూ ఎన్నికల వాతావరణం వేడెక్కింది. పార్టీలు చేరికలను ప్రోత్సహిస్తున్నాయి. ముఖ్యంగా తొలిసారి ఎన్నికల బరిలో దిగబోతున్న జనసేన పార్టీలోకి నాయకులను ఆహ్వానిస్తోంది. ఇప్పటికే పవన్ ఆహ్వానం మేరకు కొందరు నేతలు పార్టీలో చేరారు. పవన్‌తో 40 మంది టీడీపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని జనసేన నాయకులు ప్రకటించడం గతంలో సంచలనమైంది. తాజాగా జనసేన పార్టీ రాష్ట్ర కన్వీనర్ వి.పార్థసారథి మరోసారి అలాంటి ప్రకటనే చేశారు. 20 మంది ఎమ్మెల్యేలు జనసేనలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని తరువాయి 2లో..

# దుర్గగుడి పాలక మండలి కీలక నిర్ణయాలు

## చిన్నారులకు ఉచితంగా పాలు.. భక్తులకు ఉచిత ప్రసాదం

విజయవాడ: ఇకపై చిన్నారులకు ఆలయం తరపున ఉచితంగా పాలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు దుర్గగుడి ఆలయ ఈవో కోటేశ్వరమ్మ తెలిపారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఉచిత ప్రసాదంగా అప్పాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆలయ ఈవోగా కోటేశ్వరమ్మ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన తొలి సమావేశంలో ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆలయ ఛైర్మన్ గౌరంగబాబు, పాలక మండలి సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశం వివరాలను ఈవో వెల్లడించారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వారం రోజుల్లోనే భక్తుల సమస్యకు పరిష్కారంపై ద ృష్టి సారించానని చెప్పారు. వైదిక కమిటీలో ఎవరు ఉండాలనేది అర్చకులంతా కలిసి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు సేద తీరేందుకు చర్యలు తరువాయి 2లో..

# సీతారామన్‌పై కాంగ్రెస్ నేతల విమర్శలు



బెంగళూరు: కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తమ మంత్రిని డామినేట్ చేయడంపైనే ఎక్కువ ఆసక్తి చూపించారని కాంగ్రెస్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శలు చేశారు. వరదల వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేయడానికి బదులు తమ మంత్రిపై ధ్వజమెత్తి ఆధిపత్యం ప్రదర్శించాలని అనుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కర్ణాటకలోని కొడగు జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ నిన్న కొడగు పర్యటనకు వెళ్లారు. తక్షణ సాయంగా రూ.7 కోట్లు ప్రకటించారు. నష్టం అంచనా వేశాక మిగిలిన సాయం ప్రకటిస్తామని తెలిపారు. అక్కడ స్థానిక జిల్లాధికారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంపై ఆమె మండిపడ్డారు. కేంద్ర మంత్రి పర్యటిస్తుంటే ఆయా విభాగాల అధికారులంతా లేకుంటే చేసేదేముంటుంది? అంటూ కొడగు ఇన్‌ఛార్జి మంత్రి మహేష్‌పై ధ్వజమెత్తారు.

దీంతో మంత్రిపై సీతారామన్ విమర్శలు వివాదంగా మారాయి. కాంగ్రెస్ నేతలు ఆమెను విమర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని సిద్ధరామయ్య ఆరోపించారు. వరద సహాయక నిధుల విడుదలపై కేంద్ర ప్రవర్తిస్తున్న

# కేరళ తుపాను బాధితులకు ఏపీ ఎమ్మెల్యే రూ.కోటి విరాళం!



నెల్లూరు: కేరళ వరద బాధితుల కోసం భారీ విరాళాన్ని ప్రకటించారు కేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్ రెడ్డి. తరువాయి 2లో..







# కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు 'యాపిల్' ఆపన్న హస్తం!



## ప్రత్యేకంగా డొనేషన్ బటన్‌ను ఏర్పాటు

న్యూఢిల్లీ: వరదలతో విలవిల్లాడిన కేరళను ఆదుకునేందుకు అమెరికా టెక్నాలజీ దిగ్గజం యాపిల్ ముందుకొచ్చింది. సహాయక చర్యల కోసం ఏడు కోట్ల రూపాయలు విరాళంగా ఇవ్వనున్నట్టు ప్రకటించింది. కేరళ వరదలు తమను కదిలించాయని పేర్కొన్న యాపిల్ బాధితుల సహాయార్థం 'మెర్సీ కార్ప్స్', తరువాయి 2లో..

# వైకాపా గూటికి మాజీ డీజీపీ?



విశాఖపట్నం: వైకాపా అధ్యక్షుడు జగన్‌ను ఏపీ మాజీ డీజీపీ సాంబశివరావు కలిశారు. విశాఖ జిల్లా ధారభోగాపురం వద్ద పుష్పగుచ్ఛం అందజేసిన సాంబశివరావు.. ప్రజాసంకల్ప యాత్ర శిబిరం వద్దకు వచ్చి జగన్‌తో సమావేశమయ్యారు. తరువాయి 2లో..



# ఈదరపల్లి-అంబాజీపేట రహదారిని ఆధునీకరించాలి

అమలాపురం : ఈదరపల్లి నుంచి ఇందుపల్లి, సాకుర్రు మీదుగా అంబాజీపేట వరకూ ఉన్న ప్రధాన రహదారిని ఆధునీకరించాలని మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణరావు డిమాండ్ చేసారు. సాకుర్రు గ్రామంలో ముఖ్య నాయకుల సమావేశం సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈదరపల్లి వంతెన నుంచి ఇందుపల్లి, సాకుర్రు, నందంపూడి, గున్నేపల్లి అగ్రహారం వయా అంబాజీపేట వెళ్లే రహదారి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేసారు. అనేక మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తున్న ముఖ్యమైన ఈ రోడ్డు పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నారని పేర్కొన్నారు. అమలాపురం రూరల్, అంబాజీపేట మండలాలకు చెందిన ఈదరపల్లి, ఇందుపల్లి, సాకుర్రు, గున్నేపల్లి అగ్రహారం, తొండవరం, వాకలగరువు, నందంపూడి గ్రామాలకు అమలాపురం, అంబాజీపేట నుంచి వెళ్లడానికి ఈ రోడ్డు ప్రధానమైన మార్గమని, ఇంత ప్రాధాన్యమున్న ఈ రోడ్డును ఆధునీకరించకపోవడం వలన రోడ్డు గోతులు నుంచి కంకర రాళ్లు పైకి లేచి వాహనచోదకులను ఇబ్బంది పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. గతంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. అయినా పలితం కనిపించలేదని, ఈ రోడ్డులో రోజూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో గుత్తుల చిరంజీవిరావు, చొల్లంగి సత్యసాయి బాబా, ఆకుల సత్యనారాయణ, కాప రమణ, చాట్ల సత్యనారాయణ, విప్పర్తి శ్రీను, గోసంగి శ్రీను, జి.గోపి, నాగాబత్తుల నరసింహమూర్తి, జల్లి ఆనందరావు, బొంతు రామచంద్రరావ, నల్లా కిట్టప్ప, తాతా సోమేశ్వరరావు, కుడుపూడి శ్రీను, అడపా శివరావు, వక్కపట్ల శ్రీను, దారా బాలకృష్ణ, మద్దింశెట్టి చినసుబ్బరాజు, పులపర్తి సూరిపండు, నక్కా వెంకటేశ్వరరావ, నాగాబత్తుల సాంబశివ రావు, గోగి శ్రీరామమూర్తి, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కిలిమంజారో పర్వతారోహణకు విశాఖ సాహసీకులు



అచ్యుతాపురం: ప్రపంచంలోని ఏడు ఎత్తైన శిఖరాలలో ఒకటైన కిలిమంజారో పర్వతారోహణకు విశాఖపట్టణానికి చెందిన ముగ్గురు యువకులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన సర్వీసులు శాఖ వచ్చే నెల మొదటి వారంలో విజయవాడ నుంచి పంపిస్తున్న బృందంలో ఈ ముగ్గురు స్థానం సంపాదించారు. ఆఫ్రికా ఖండంలోని టాంజానియా దేశంలో గల కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించేందుకు 40 మందిని యువకులను యువజన సర్వీసుల శాఖ ఎంపిక చేసింది. వారిలో విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం మండలం కొల్లివాని గ్రామానికి చెందిన పైల మణీంద్ర, పాడేరు మండలం వెగసపల్లి గ్రామానికి చెందిన బాల వెంకట మురళీకృష్ణ ప్రసాద్, సబ్బవరం మండలం నారపాడు గ్రామానికి చెందిన ఆర్.నానాజీ కిలిమంజారో వెళ్ళే బృందంలో స్థానం సంపాదించారు. 23 ఏళ్ళ మణీంద్ర పర్వాతారోహకునిగా ఎదగాలనే సంకల్పంతో సాధన చేస్తున్నారు. ఇప్పటికే దేశంలోని పలు పర్వతాలను అధిరోహించారు. 21 ఏళ్ళ నానాజీ డిగ్రీ పూర్తి చేయగా, మురళీకృష్ణ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కిలిమంజారో పర్వతారోహణ కోసం సాహసీకుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర యువజన సర్వీసులు శాఖ ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటన విడుదల చేసింది. విశాఖ జిల్లా యువకుల కోసం బక్కన్నపాలెంలోని 16వ బెటాలియన్ పోలీసు గ్రౌండ్‌లో ఎంపిక నిర్వహించారు. వారిలో 12 మందిని ఎంపిక చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎంపికైన 140 మంది యువకులకు విజయవాడలోని సిబిఆర్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో మెరుగైన శిక్షణ ఇచ్చారు. వారిలో 60 మందిని జమ్మూ కాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో గల జవహర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటినేరింగ్‌కు ప్రత్యేక శిక్షణ కోసం పంపించారు. అక్కడ తొమ్మిది అంశాలలో పరీక్షలు నిర్వహించి 40 మందితో తుది బృందాన్ని ఎంపిక చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం, కృష్ణ, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన సాహసీకులు ఈ బృందంలో ఉన్నారు. రఘునాథరెడ్డి సారధ్యంలో ఈ బృందం వచ్చే నెల మొదటి వారంలో కిలిమంజారో బయలుదేరి వెళ్తుంది.

# నేడు దుర్గా నమస్కార పూజ

కాకినాడ: స్థానిక శ్రీ రాఘవేంద్రస్వామి బృందావన సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో సూర్యారావు పేటలో వేంచేసివున్న శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం (26) శ్రావణమాస సందర్భంగా సాయంత్రం 6గం॥నుండి శ్రీ దుర్గానమస్కార పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమితి కార్యదర్శి ఎమ్. రాఘవేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు భక్తులందురూ పాల్గొని దుర్గాదేవి అనుగ్రహాన్ని పొందవల్సిందిగా కోరారు.

# 3వ తేదీన సత్యదేవుని హుండీలు లెక్కింపు

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీలు లెక్కింపు ది.03-08-2018 తేదీన ఉదయం 7-30గం.లకు తెరుచుటకు సదరు సొమ్మును బ్యాంకులో జమ చేయుటకు కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు మేరకు గ్రామస్థులకు,భక్తులకు తెలియజేయడమైనది.

# జిల్లా ప్రజా పరిషత్ గెస్ట్ హౌస్ శంఖుస్థాపన

అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా శనివారము స్ధానిక పంచాయతీ ఆఫీసు వద్ద ఉన్న జిల్లా ప్రజాపరిషత్ ఖాళీ స్ధలములో జిల్లా ప్రజాపరిషత గెస్ట్ హౌస్ శంఖుస్థాపన కార్యక్రమంను ప్రత్తిపాడు నియోజకవర్గం శాసన సభ్యులు వరుపుల.సుబ్బారావు శంఖుస్థాపన చేసారు.ఈ కార్యక్రమంలో తుని మార్కెట్ యార్డు చైర్మెన్ యనమల. కృష్ణుడు, పర్వత.సురేష్, శంఖవరం మండల ప్రెసిడెంట్ బద్ది.రామారావు, మండల.వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి.సత్తిబాబు, మాజీ గ్రామ సర్పంచి రాజాల గంగాభవాణి, టీడీపీ టౌన్ అధ్యక్షుడు వీర్ల.సూరిబాబు, రాజాల.చిట్టిబాబు, మడ్డు.వీరబాబు, పలివెల. సతీష్, బండారు. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల27న తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

రావికమతం : ఈ నెల 27న సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనుల భూసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయనున్నట్లు సిపిఎం నాయకులు కె.గోవిందరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బాదనపాడు రెవెన్యూలో గిరిజనుల భూములు ఆక్రమించిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సర్వే నెంబరు 56, 57, 58, 59లో 40 ఎకరాల సీలింగ్ భూమి, కవ్వగుంట రెవెన్యూలో సర్వే నెంబరు 61, 62, 64లో 30 ఎకరాల డిపట్టా భూమి పెత్తందారులు ఆక్రమించారన్నారు. బుడ్బిబంద సర్వే నెంబరులో ఉన్న 120 ఎకరాల డిపట్టా భూమిని జిరాయితీగా మార్చి కొన్న వారిని తొలగించి గిరిజన సాగుదారుల పేర్లు నమోదు చేయాలన్నారు.

# యాజమాన్య పద్దతుల ద్వారా అధిక లాభాలు

నాతవరం : యాజమాన్య పద్దతుల రైతులు అధిక లాభాలు పొందవచ్చుని ఇన్‌చార్జ్ ఏఒ చిరంజీవి తెలిపారు. నారుమడి దగ్గర నుంచి యాజమాన్య పద్దతుల ద్వారా పంటలు పండించడం వల్ల ఎకరానికి సుమారు ఐదు బస్తాల దిగుబడి అధికంగా పొందవచ్చునన్నారు. ఎకరాకు 10 సెంట్లు విస్తీర్ణంలో నారుమడి వేసుకోవాలని చెప్పారు. పంట పొలాల గట్లపై కందులు వేసుకుంటే సరఫరా చేస్తామన్నారు. అవసరమైన వారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు దరఖాస్తులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఇఒ ఎన్.నారాయణరెడ్డి ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి

## కడపలో ఘనంగా వనం-మనం

రోజుల్లో ప్రపంచానికి మన రాష్ట్రం ప్రకృతి సేద్యానికి కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా జలసంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామన్నారు. గోదావరి నీళ్లు సోమశిలకు తీసుకొస్తామని, వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేస్తామని తెలిపారు.

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ప్రథమ స్థానంలో ఉన్నామని, సుఖప్రదమైన జీవనానికి శ్రీకారం చుడుతున్నామని చంద్రబాబు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అత్యంత నివాసయోగ్యమైన రాష్ట్రంగా ఏపీ మారాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేశామని, కేంద్ర ప్రభుత్వం ముందుకు రావట్లేదని మండిపడ్డారు. కేంద్రం సహకరించకపోయినా పట్టుదలతో పనిచేస్తున్నామని, ఉక్కు పరిశ్రమపై కేంద్రం ప్రకటన చేసే వరకూ పోరాడతామని చెప్పారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి తీరుతామని స్పష్టం చేశారు.

## ప్రజలంతా కోలుకోవాలి

(31 శాతం) తిరిగి నివాసానికి అనుకూలంగా మార్చాం. చాలా ప్రాంతాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించాం. 16,158 ట్రాన్స్‌ఫారంలలో ఇప్పుడు 14,314 పని చేస్తున్నాయి' అని పేర్కొంది.

## వేడెక్కిన ఎన్నికల వాతావరణం

పార్థసారథి తెలిపారు.వారంతా ఇప్పటికే పవన్ కళ్యాణ్‌తో చర్చించారని, ఆయన నిర్ణయాన్ని తీసుకున్నా ఆ ఎమ్మెల్యేలను పార్టీలోకి ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు. శుక్రవారం రాజమండ్రిలో తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు మేడా గురుదత్ ప్రసాద్, ఉభయగోదావరి జిల్లాల కన్వీనర్ కలవకొలను తులసితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీలో నవ తరానికి 60 శాతం సీట్లు ఇస్తామని ఈ సందర్భంగా పార్థసారథి తెలిపారు. 2019 ఎన్నికల కోసం రాష్ట్రం మొత్తానికి ఓ మేనిఫెస్టో రూపొందిస్తామని, దీనికి అదనంగా ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో మేనిఫెస్టో రూపొందిస్తామని పార్థసారథి తెలిపారు.

## సీతారామన్‌పై కాంగ్రెస్ నేతల విమర్శలు

తీరును ఖండిస్తున్నానని అన్నారు. వరద నష్టాన్నిఅంచనా వేసేందుకు ప్రధాని మోదీ వస్తారని భావించామని, కానీ రక్షణ మంత్రిని పంపించారని, ఆమె తమ మంత్రిని వివాదాస్పదుడిగా చెయ్యడంపైనే అధిక ఆసక్తి చూపారని ట్విటర్ ద్వారా విమర్శించారు. ఇది కర్ణాటక పట్ల కేంద్ర చూపుతున్న ఉదాసీనతకు నిదర్శనమని సిద్ధరామయ్య ట్వీట్‌లో పేర్కొన్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి జీ.పరమేశ్వర కూడా ఈ వివాదంపై స్పందించారు. "మా మంత్రి చాలా రోజులుగా కొడగులోనే ఉండి జిల్లా అధికారులతో కలిసి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. సహాయం అందించాల్సిన మీరు మా తోటి మంత్రిని తిట్టడం నిరాశ కలిగించింది' అని పరమేశ్వర ట్వీట్ చేశారు. కేంద్రం, రాష్ట్రం మధ్య సమన్వయం ఉండాలని, ఇద్దరూ సమానంగా పనిచేయాలని, కేంద్రం, రాష్ట్రం భాగస్వాములు అని.. ఎవ్వరూ తక్కువ కాదని ఆయన చెప్పారు.

## దుర్గగుడి పాలక మండలి కీలక నిర్ణయాలు

చేపట్టామని, రెండు చోట్ల షెడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. పార్కింగ్ సమస్య అధిగమించేందుకు శివాలయం మెట్ల దిగువన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భద్రతా చర్యల్లో భాగంగా గుడి పరిధిలో ఆధునిక కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాదరక్షల కౌంటర్ వద్ద సిబ్బంది డబ్బులు వసూలు చేయకుండా నియంత్రించామని చెప్పారు.

## *కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు 'యాపిల్' ఆపన్న హస్తం!*

'ముఖ్యమంత్రి సహాయ నిధి'కి రూ.7 కోట్ల విరాళం ఇస్తున్నట్టు పేర్కొంది. ఇళ్లు, స్కూళ్లు పునర్నిర్మాణం కోసం వీటిని వినియోగించనున్నట్టు వివరించింది. విరాళం ప్రకటించి చేతులు దులుపుకోకుండా తమ వినియోగదారులను కూడా సాయం చేయాల్సిందిగా కోరింది. యాపిల్ యాప్ స్టోర్, ఐట్యూన్స్ స్టోర్ ద్వారా వినియోగదారులు మెర్సీ కార్ప్స్‌కు సాయం అందించవచ్చని తెలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా డొనేషన్ బటన్‌ను ఏర్పాటు చేసింది. ఈ బటన్‌ను ప్రెస్ చేయడం ద్వారా యాపిల్ వినియోగదారులు 5, 10, 25, 50, 100, 200 డాలర్లను మెర్సీ కార్ప్స్‌కు విరాళం ఇవ్వవచ్చని తెలిపింది. కేరళ వరదల్లో 417 మంది ప్రాణాలు కోల్పోగా, లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారు. వరద తగ్గుముఖం పట్టడంతో బాధితులు ఇప్పుడిప్పుడే ఇళ్లకు చేరుకుంటున్నారు.

## కేరళ తుపాను బాధితులకు ఏపీ ఎమ్మెల్యే రూ.కోటి విరాళం!

*నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గౌతమ్ రెడ్డి ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. తన సంస్థ తరపు నుంచి, వ్యక్తిగతంగా కోటి రూపాయల విరాళాన్ని ప్రకటిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఈ విరాళాన్ని జమ చేయనున్నట్టుగా వివరించారు. కేరళ సీఎం పినరాయి విజయన్‌ను కలిసి ఈ విరాళం చెక్‌ను అందించనున్నట్టుగా ఆయన వివరించారు. ఈ నెల 28, 29 తేదీల్లో తను కేరళ వెళ్లి.. సీఎం అపాయింట్‌ను తీసుకుని విరాళం చెక్‌ను అందించనున్నట్టుగా తెలిపారు. వరద బాధితుల పునరావాసం కోసం, ఇతర కార్యక్రమాల కోసం ఈ డబ్బును వినియోగించమని కోరనున్నామన్నారు. కేరళ వరదల బాధితుల కోసం ఏపీ ప్రముఖుల నుంచి వచ్చిన భారీ విరాళాల్లో ఇది ఒకటి. ఇది వరకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కేరళ వరద బాధితుల కోసం కోటి రూపాయల మొత్తాన్ని విరాళంగా ప్రకటించారు. ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అదే స్థాయి మొత్తాన్ని విరాళం ఇస్తున్నారు.*

## వైకాపా గూటికి మాజీ డీజీపీ?

దాదాపు 15 నిమిషాల పాటు ఇరువురూ చర్చించుకున్నారు. మాజీ డీజీపీ సాంబశివరావు జగన్‌తో భేటీ కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మాజీ డీజీపీ సాంబశివరావు త్వరలో వైకాపాలో చేరబోతున్నారని చెప్పారు. సాంబశివరావు చేరికతో వైకాపా మరింత బలోపేతమవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# గోప్యత అంటే రహస్యాల రక్షణ కాదు

## కేంద్ర సమాచార కమిషర్ 'మాడభూషి'



విశాఖపట్నం : ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారయంత్రాంగానికి వ్యక్తిగత గోప్యత హక్కు వర్తించదని కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు (న్యూ ఢిల్లీ) పేర్కొన్నారు. ప్రయివసీ (గోప్యత) అంటే రహస్యాల రక్షణ కాదు ... ఒక మనిషి వ్యక్తిగత జీవిత వివరాలను గోప్యంగా ఉంచడం మాత్రమేనన్నారు. పబ్లిక్ ఫోరం ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సమావేశం హాలులో శనివారం సమాచార హక్కుపై జరిగిన ఒక రోజు శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. గోప్యతను అస్త్రంగా వినియోగించి సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టాన్ని నిర్వీర్యం చేస్తే ప్రజలు ఉపేక్షించరన్నారు. ప్రయివసీ లేదా వ్యక్తిగత గోప్యత. కుటుంబం, పెళ్ళి ,పిల్లల సంగతులన్నీ సొంతమన్నారు. ఇవిగాకుండా మరేవీ ప్రయివసీ కిందికి రావన్నారు. ప్రజలతో సంబంధం ఉన్న అన్ని కార్యక్రమాల సమాచారాలు వ్యక్తిగతం అయ్యే అవకాశం లేదన్నారు. విధి నిర్వహణలో తప్పు చేసిన ఉద్యోగులు పాలనాధికారులపై వచ్చిన ఫిర్యాదులు, వాటిపై విచారణలు, తీసుకున్న చర్యలు, విధించిన శిక్షలు ఆ ఉద్యోగుల ప్రయివేటు వ్యవహారాలు కావు, అవి యజమానులకు వారి కింద పనిచేసే ఉద్యోగులకు సంబంధించిన అంశాలు కనుక అందరికీ చెప్పనవసరం లేదనడం సరి కాదన్నారు. ప్రయివసీ హక్కును సమాచార హక్కుతో పాటు రక్షించుకోవాలి కాని, సమాచార హక్కును బలిపెట్టి ప్రయవసీని రక్షించడం ద్వారా అవినీతిని దాచే యత్నం సరికాదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విధులతో సంబంధం లేని వ్యక్తిగత విషయాల జోలికి ఎవ్వరూ వెళ్లకూడదని ఆయన స్పష్టం చేశారు. గోప్యత, సమాచార హక్కు ప్రాధమిక హక్కులేనని స్పష్టం చేశారు. ఆర్టీఐ చట్టం కింద సమాచారం కోరుతూ దాఖలయ్యే దరఖాస్తులను ఎక్కువ శాతం అధికారులు చట్టంలోని సెక్షన్ 8 (1) (జె) కింద తిరస్కరిచడం ఇప్పటికే ఎక్కువైందని, ఇప్పుడు గోప్యత హక్కును కొంతమంది అధికారులు దాన్నో శక్తిమంతమైన కవచంలా వాడుకునే ప్రమాదం ఉందని, దీనిని ప్రజలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలను ప్రివిలేజ్ చాటున దాచటం న్యాయం కాదని చట్టం ప్రకారం ఆ అంశాలను వెల్లడించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈనాటి పారదర్శక శాసనాలకు, సమాచార హక్కు చట్టానికి మూలధారమన్నారు. దేశంలో కేవలం భూ సమస్యల కోర్టు కేసుల నిమిత్తం రూ.లు 1163 కోట్లు కేంద్ర ప్రభుత్వం వ్యయం చేసిందన్నారు. తక్షణం భూమి రికార్డులన్నీ డిజిటైలేజన్ చేయాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార కమిషన్ ఇచ్చిన కొన్ని తీర్పులు, ప్రభుత్వ ఉత్తర్వులు గురించి శ్రీధర్ ఆచార్యులు వివరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ సమాచార హక్కు ప్రజల హక్కు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సేవకులన్న విషయాన్ని మరువరాదన్నారు. ప్రజలు నిబద్ధతతో ప్రజా ప్రయోజనాల అంశాలకు సంబంధించిన అంశాలపై ఆర్టీఐ దరఖాస్తులు సంధించాలన్నారు.సమావేశానికి అధ్యక్షత వహించిన సమాచార హక్కు రాష్ట్ర అవార్డుగ్రహీత, పబ్లిక్ ఫోరం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలో జరుగుతున్న మార్పులు, తీర్పులు, అమలు తీరుతెన్నులు గురించి వివరించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఐ చట్టంపై కళాశాలలు, హైస్కూళ్ల విద్యార్థులకు అవగాహన కల్పించనున్నామన్నారు.ఈ సందర్భంగా వ్యక్తిగత సమాచారం, గోప్యత-సమాచార హక్కు, న్యాయస్థానాల తీర్పులు, సమాచార కమిషన్ల తాజా తీర్పులు, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సమాచార హక్కు చట్టం అమలు తీరుతెన్నులు, విజయాలు, దరఖాస్తుదజారుల ఇబ్బందులు, ప్రభుత్వ ఉత్తర్వులు, ఆర్టీఐ చట్టం సెక్షన్ 8, 11 తదితర అంశాల గురించి శిక్షణ జరిగింది. అదే విధంగా శిక్షణలో జరిగిన ప్రశ్నలు-సమాధానాల కార్యక్రమం అందరికీ ఉత్సాహాన్ని ఇచ్చింది. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్ లాలం భవానీ భాస్కర్, రిటైర్డ్ సీఇవో ఆర్.జయప్రకాష్‌నారాయణ్, హెల్ప్ టు హెల్ప్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ బి.ఎం.నాయుడు, గీతం లా యూనివర్సిటీ డైరక్టర్ డాక్టర్ వై.సత్యనారాయణ, సమాచాలోచన సంస్థ కన్వీనర్ బి.చక్రధర్, ప్రజా వేగు పట్టా రామఅప్పారావు, స్టేట్ రిసోర్స్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ గేదెల శ్రీనువాసరావు, పుట్టా గంగయ్య, రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి ఆర్టీఐ చట్టం క్రియాశీల కార్యకర్తలు, రాష్ట్ర రాజధాని నుంచి కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, అనధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఆన్‌లైన్‌లో ఆర్టీఐ దరఖాస్తులు స్వీకరించాలి**

**శిక్షణలో పాల్గొన్న ఉద్యమకర్తలు దిగువ తీర్మానాలను ఆమోదించారు.**

**- రాష్ట్రంలో సమాచార కమిషన్‌ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి.**

**- ఆన్‌లైన్‌లో ఆర్టీఐ దరఖాస్తులు స్వీకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.**

# ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తనలు

విశాఖపట్నం: అన్నమయ్య పదకోకిల పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ స్థాపించిన అన్నమాచార్య భావనా వాహిని విశాఖ నగర శాఖ ఆధ్వర్యంలో రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులో గల శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన అందరినీ ఆకట్టుకుంది. శ్రీ శారదా అన్నమయ్య సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు పారుపల్లి సత్యన్నారాయణ శిష్యబృందం పి.శారద, ఎస్. ఆశ్రిత వత్సలలు అన్నమాచార్య సంకీర్తనలు గానం చేసి సభికుల మన్ననలను పొందారు. ఎ.అన్నపూర్ణ నేతృత్వంలో సామూహికంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ ఎ.పి.ఎస్.మూర్తి, ప్రోగ్రాం కన్వీనర్ ఎం.వి.రాజశేఖర్, కో- కన్వీనర్స్ ఆచార్య ఆర్.మురళీకృష్ణ, జి. ఉదయభాస్కరరావు, ఎ.అన్నపూర్ణ, శ్రీ రాఘవేంద్ర స్వామి వారి మఠం మేనేజర్ కె.పవన్ కుమార్ ఆచార్య, విశాఖ నగరానికి చెందిన ప్రముఖులు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు. విచ్చేసినవారందరికీ తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

# వైభవంగా సహస్ర దీపార్చన

విశాఖపట్నం: వేల గొంతులు హరేరామ హరేకృష్ణ నామాన్ని ఆలపించాయి. భక్తజనులు ఊంజల్ సేవలో తన్మయత్వం చెందారు. జిల్లా పరిషత్ ప్రధాన కూడలిలో ఉన్న శ్రీ కృష్ణ చైతన్యమఠం పీఠాధిపతి గురుశ్రీ త్రిదండి స్వామి బి.ఎస్.కేశవ్ మహారాజ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సహస్ర దీపార్చన - ఊంజల్ సేవ అత్యంత వైభవంగా జరిగాయి. సాంప్రదాయ రీతిలో నిర్వహించిన సహస్ర దీపార్చనలో నగరవాసులు హాజరై కనువిందు చేశారు. మంగళధ్వని, వేదమంత్ర పఠనం, హరేనామ హోమ మంత్ర సంకీర్తనా, అశేష భక్తజన సందోహం మధ్య భక్తులు ఆధ్యాత్మికలోకంలో విహరింపజేసింది. ఈసందర్భంగా నగరానికి చెందిన చందన డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన పలు నృత్యాలు ఆహూతులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీకృష్ణ చైతన్యమఠం పీఠాధిపతి గురుశ్రీ త్రిదండి స్వామి బి.ఎస్.కేశవ్ మహారాజ్ వారు మాట్లాడుతూ ఈ నెల 22న శ్రీకారం చుట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు వచ్చే నెల 4నశ్రీ కృష్ణ జన్మాష్టమి వరకు వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీ భాష్యం శ్రీనివాసాచార్యులు, రాజేష ప్రభు, యెన్నేటి శ్రీనివాసరావు, చందన డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ కె.నాగచందన, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జనతాకాలనీ సమస్యలు పరిష్కరించండి

## - ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్ నాయుడు



విశాఖపట్నం : జివియంసి నాలుగవ జోన్‌కు చెందిన 48,49 వార్డులుకు చెందిన జనతాకాలనీ, అచ్చెన్నాయుడు లోవ, ప్రకాష్‌నగర్, శ్రీహరిపురం, గుల్లల పాలెంకు చెందిన డ్రెయిన్లను సత్వరం పూర్తి చేసి సమస్య పరిష్క రించాలని కమిషనర్ హరినారాయణన్ కు ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు) తెలిపారు.

శనివారం క్షేత్ర పర్యటనలో భాగంగా కమిషనర్ హరినారాయణన్ తో కలసి ప్రభుత్వ విప్ పర్యటించారు. ఈ సందర్భంగా జనతా కాలనీ కాలువ పూడుకుపోయిందని, దానిని వెడల్పు చేసి వినియోగంలోకి తేవాలని కోరారు. అదేవిధంగా గెడ్డకు రెండు వైపులా బండ్ ఆక్రమణకు గురికాకుండా వాకింగ్ ట్రాక్ లేదా మొక్కలు పెంతదుపరి శ్రీహరిపురం గుల్లలపాలెం డ్రెయిన్‌కు గ్రేటింగ్స్ వేయడం వలన మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడు తున్నందున హెచ్.పి.సి.యల్ సంస్థ ప్రతినిధులతో చర్చించి పరిష్కరించాలని సూచించారు.

### విద్యుత్ వినియోగదారుల

# ఫోరం సదస్సు

భీమునిపట్నం : భీమిలి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం లో వినియోగ దారుల ఎదుర్కోను చున్న సమస్య లపై సదస్సు నిర్వహించారు.ఈ సదస్సు కు సి.జి.ఆర్ ఎఫ్. సభ్యులు జనరల్ మేనేజర్ ఫైనాన్స్ కె.బాలాజీ, జనరల్ మేనేజర్ టెక్నికల్ పి,వి,రమణరావులు పాల్గొన్నారు. ఇందులో సెప్టెంబర్ 2016 నుండి ఇప్పటి వరకు వచ్చిన కేసులు 876 అని ఇప్పటి వరకూ పరిష్కారం అయిన కేసులు 846 అయ్యాయని, సి.జి.ఆర్.ఎఫ్. పరిధిలో గల ఐదు జిల్లాల లో విద్యుత్ వినియోగదారులకు న్యాయ విజ్ఞాన సదస్సులు నూట ఆరు నిర్వహించామని, ఇరవై ఏడు కేసుల్లో సి.జి.ఆర్ ఎఫ్. విద్యుత్ వినియోగదారులకు జరిగిన నష్టానికి గాను నష్టపరిహారం 98,500 చెల్లించవలసింది గా ఏ.పి.ఇ.డి.సి.ఎల్. సిబ్బందికి ఉత్తర్యు జారీ చేసామని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 1912 తెలపాలని ఈ నెంబర్ ఇరవై నాలుగు గంటలు పనిజేస్తుంద ని భీమిలి విద్యుత్ కార్యాలయం ఏ.డి. ఇ. ఎ. కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సదస్సులో ఏ.ఇ.రమణమూర్తి భీమిలి, పద్మనాభం మండలాల వినియోగ దారులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి

# చర్యలు తీసుకోవాలి

## - కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : నాలుగవ జోన్‌కు చెందిన 48, 49 వ వార్డులకు చెందిన గెడ్డ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ హరినారాయణన్ అధికారులకు సూచించారు. శనివారం ప్రభుత్వ విప్ గణబాబుతో కలసి సమస్యాత్మక ప్రాంతాలలో పర్యటించారు. ప్రభుత్వ విప్ సూచించిన సమస్యలపై దృష్టి సారించి గెడ్డ పూడికతీత పనులను వేగవంతం చేయాలని యస్.ఇ వినయ్ కుమార్‌ను ఆదేశించారు.

అదేవిధంగా గెడ్డకు ఇరువైపుల మొక్కలు నాటించాలని పేర్కొన్నారు. కాలనీ వాసులుకు అసౌక ర్యం లేకుండా పారిశుధ్యం, గెడ్డ పనులను చేపట్టాలని ఇ.ఇ లు చిరంజీవి, రాంమోహన్ తదితరులను ఆదేశించారు. స్లోప్‌ను సరించి గ్రేడింగ్ చేయాలని పేర్కొన్నారు.

పర్యటనలో జోనల్ కమిషనర్ యస్.రమణమూర్తి, యస్.ఇ వినయ్‌కుమార్, ఇఇలు చిరంజీవి, రాంమోహన్, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.



**33వవార్డు, తాటిచెట్లపలెంలో గల సాక్షి మహాగణపతి ఆలయం నూతన గృహ శంకుస్థాపన జరిగినది. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు శర్మ స్వామి వారికి విశేషమైన పూజలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్ల అధ్యక్షులు తైనాల విజయకుమార్, పార్లమెంట్ సమన్వయకర్త ఎం.వి.వి.సత్యనారాయణ, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, సీనియర్ నాయకులు సత్తి రామకృష్ణ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల శ్రీను, జీరు గోపి, ఆళ్ల నరసింగరావు, జామి హరినాథ్, రెబాక శ్రీను, బొర అప్పల రెడ్డి, సోదాల సెట్టి, ఎం.కుమార్, డుప్పలపుడి శ్రీను, గంగా మహేశ్ పాల్గొన్నారు.**

# ఘనవ్యర్థ నిర్వహణ నిబంధనలు అందరూ పాటించాలి

## - కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ రూల్స్ 2016 స్వచ్ఛ భారత్ మిషన్‌కు అనుబంధంగా శాస్త్రీయ పద్ధతిలో మున్సిపల్ ఘనవ్యర్థాల నిర్వహణ పటిష్టంగా అమలు చేయుటకు జివియంసి వివిధ చర్యలను చేపట్టినట్లు కమిషనర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. సదరు నిబంధనలు ప్రకారం అన్ని స్కూల్స్, కళాశాలలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, మాల్స్ మరియు షాపింగ్ కాంప్లెక్స్‌లు ఆధునిక, శాస్త్రీయ పద్ధతిలో ఘణవ్యర్థాలు ఉత్పత్తి అయిన చోటే తడి-పొడి చెత్తగ విడదీసి సేకరించవలసిన ఆవశ్యకత కలదని వెల్లడించారు.

సదరు నిబంధనలను జివియంసిలో యధాతథంగా అమలు పరచుటకు గాను నగరపాలక సంస్థ తీర్మానం నెంబరు 1250/2018 తే.13.08.2018 ప్రకారం ప్రత్యేకఅధికారి ఆమోదించారు.

కావున పైన పేర్కొన్న సంస్థలు తడిచెత్త కోరకు ఆకుపచ్చ, పొడి చెత్త కోసం నీలిరంగు చెత్త బుట్టలను ఉపయోగించడం తప్పనిసరి చేయుచూ చట్టంలోని సెక్షన్ 483 ప్రకారం అపరాధరుసుంలు వసూలు చేయుటకు అధికారం పొందియున్నారు. పై నిబంధనలు అమలు పరచని వారికి మొదటి తప్పుకు రూ.200/- రెండవ తప్పుకు రూ.300/- మూడవ తప్పుకు రూ.500/- అపరాధరుసుం విధించుటతోబాటు ఇతర చర్యలు చేపట్టుటకు కార్పోరేషన్ ప్రత్యేకఅధికారి తీర్మానం ఆమోదించినందున అమలులోకి వచ్చినట్లు పేర్కొన్నారు.

# జగన్ పాదయాత్రకు తరలివెళ్ళిన వాసుపల్లి సేన



అచ్యుతాపురం : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్.జగన్మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజా సంకల్పయాత్రకు వైయస్ఆర్‌సీపీ నాయకులు వాసుపల్లి శ్రీనువాసరావు ఆధ్వర్యంలో శనివారం పూడిమడక నుండి అధిక సంఖ్యలో వైయస్ ఆర్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్ళారు.

### మానవ విసర్జిత మురుగునీటి నిర్వహణ

# నియమ నిబంధనలు అమలుకు చర్యలు

## - కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : భారత ప్రభుత్వం ప్రచురించిన నూతన జాతీయ మానవ విసర్జిత మురుగు నీటి నిర్వహణ నియమ నిబంధనలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ మురుగు నీటి నిర్వహణ నియమ నిబంధనలు, జివియంసి తీర్మానం నకు అనుగుణంగా నియమ నిబంధనలు అమలు చేయుటకు విధి విధానములు గెజిట్ నెం.35/ 2018 నందు ప్రచురించినట్లు కమిషనర్ హరి నారాయణన్ పేర్కొన్నారు.

మానవ విసర్జితాలు మురుగు అనగా వ్యక్తిగత మరుగుదోడ్లు గుంతలయందు మరియు సెప్టిక్ ట్యాంక్‌లు కూడిన పాక్షిక ద్రవ పదార్ధము. ఈ ద్రవంలో ఎక్కువ భాగము పాక్షికము గ జీర్ణమైన మానవ విసర్జితాలు నీరు కలిగి ఉంటాయి. ఈ ద్రవము నేరుగా కాలువలలో కలవడం వలన మరియు అశాస్త్రీయ పద్ధతిలో పాడుబడిన చెరువులు, నీటి గుంటలులో పారవేయుట వలన వాతావరణ, భూగర్భ నీటి కాలుష్యంతో పాటు ప్రజా రోగ్యముపైన పెను ప్రభావం చూపుచున్నదని తెలియజేయడమైనది.

పైన పేర్కొన్న విధి విధానముల కనుగుణంగా జివియంసి సొంత మానవ విసర్జితాల నిర్వహణ రూపొందించుట జరిగి నదని తెలిపారు.

### వుయ్ కేర్ యు సంస్థ ఆధ్వర్యంలో

# మిగులు భోజనం పంపిణీ

భీమునిపట్నం : సరైన భోజనం లేక పెట్టిన భోజనం ఆత్రుతగా తినడం చూసి ఆనందమే వేరుగా ఉంటుందని వుయ్ కేర్ యు సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విశాఖ, ఆరిలోవ లో సభ్యులు యుగంధర్ బంధువుల ఫంక్షన్లలో మిగులు భోజనం ను రాత్రి మణికంఠ స్వీట్స్ యజమాని వాహనం లో వెళ్ళి ద్వారకానగర్, రైల్వేస్టేషన్ పరిధిలో జివిఎంసి సిబ్బందికి పంచినట్లు చెప్పారు.

వారు ఎంతో ఆనందంగా తినడం చూస్తే నాకళ్ళలో నీరు తిరిగిందని చెప్పారు. అలాంటి ఆనందం ను భగవంతుడు నాకు ఈవిధంగా ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.అంతేకాకుండా మాకు అనుక్షణం సామానులు తీసుకునివెళ్ళడానికి వాహనం ఏర్పాటు చేసిన మణికంఠ స్వీట్స్ యజమానికి ధన్యవాదాలు తెలిపారు.

### ఆంధ్రా యూనివర్శిటీలోని

## డా.బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సెంటర్ గౌరవ సంచాలకులుగా ఆచార్య ఎస్.శోభశ్రీ



మాధవధార : ఆంధ్రా యూనివర్శిటీలోని డా.బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సెంటర్ గౌరవ సంచాలకులుగా ఆచార్య ఎస్.శోభశ్రీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సింహాద్రి అప్పన్న ప్రచార సమితి సమైక్య నిర్వాహకులు సనపల నారాయణస్వామి, ఎస్.కోట, వివేకానంద డిగ్రీ కాలేజ్ లెక్చరర్ జి.సత్తిబాబు శనివారం పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# నరవ కొత్తురులో ఎమ్‌పిఎమ్ ట్రస్టు వైద్య శిభిరం



విశాఖపట్నం : రాష్ట్ర శాసన మండలి సభ్యుడు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎమ్.పి.ఎమ్. ట్రస్టు ఇటీవల ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుతో కలసి శనివారం 57వ వార్డు నరవకొత్తురులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వీలు కలుగుతుందని, సకాలంలో వైద్యం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా డాక్టర్.ఎం.వి.వి.ఎస్.మూర్తి ఉచిత వైద్య శిబిరాల నిర్వహణపై దృష్టి నిలిపిందన్నారు. కలుషిత వాతావరణం కారణంగా కంటి సమస్యలతో పాటు వివిధ రకాల రోగాలతో సతమతమవుతున్న స్థానికులు ఈ వైద్య సేవలు పొందాలన్నారు.ఈ శిభిరంలో మూత్రపిండాల సమస్యలు, స్త్రీల సమస్యలు, క్షయ, మోకాళ్ళలో ఆరుగుదల, గుండె జబ్బులకు, పరీక్షలు జరిపారు. నరవకొత్తురులో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిభిరం ద్వారా స్థానికలలో ఆధికశాతం మంది కంటి సమస్యలు, వినికిడి సమస్యలతో బాధ పడుతున్నాట్లు వైద్యలు గుర్తించారు.

గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి, జిమ్‌సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు, పెద్ద ఎత్తున సిబ్బంది వైద్య శిబిరాలలో పాల్గొన్నారు. కాగా శనివారం 250 మందికి దంత పరీక్షలు, 200 మందికి కంటి వైద్య పరీక్షలు, 250 మంరికి స్త్రీ సంబంధిత పరీక్షలు, 200 మందికి సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు ఎం.ముత్యాల నాయుడు, బి.అప్పలరాజు, వెంకటరమణ, ఎస్.పైడరాజు ట్రస్ట్ నిర్వాహకులు లేళ్ళ కోటేశ్వరావు, పి.వి.రామారెడ్డి, శంకరావు, తదితరులు పాల్గొన్నారు.

# డయాబెటిక్ పై అవగాహన సదస్సు



భీమునిపట్నం : భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో విద్యార్థులకు భీమిలి సెంటినియల్ లయన్స్ క్లబ్ అద్వర్యంలో డయాబెటిక్ పై అవగాహన సదస్సు జరిగింది. ఇందులో డాక్టర్ రామారావు, భీమిలి ప్రభుత్వ ఆసు పత్రి ప్రదాన వైద్య అదికారి దిద్దె .సిదార్ధ కుమార్, జూనియర్ డాక్టర్ ప్రణీత, ఆయుర్వేదిక డాక్టర్ వాయునందనరావులు డయాబెటిక్ పై సుమారు 120 మంది విద్యార్థులు అవగాహనా కలిప్పించారు.

ఈ కార్యక్రమం లో భీమిలి సెంటి నియల్ లయన్ క్లబ్ ప్రెసిడెంట్ సునీత కంటుభుక్త, లయన్ క్లబ్ కోశాధికారి పోలుబోతు విజయ, సభ్యులు కలిగొట్ల బాబ్జి, అక్కరమాని రాము నాయుడు, కంటుభుక్త రామానాయుడు, కదిరి జగన్నాదం, లచ్చుబుగత. గణపతి, చాగంటి సుబ్బారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గ్లోరీ దయా కుమారి, లెక్చరర్ల పాల్గొన్నారు.

### అప్పన్నను దర్శించుకున్న

## హైకోర్టు జడ్జి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి



సింహాచలం : శ్రీవరాహలక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం హైకోర్టు జడ్జి జస్టిస్ సి.వి.నాగర్జునరెడ్డి దర్శించుకున్నారు. ముందుగా ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయ అధికారులు స్వాగతం పలుకగా అంతరాలయంలో అర్చకస్వాములు గోత్ర నామాలతో ప్రత్యేకార్చనలు చెయ్యగా అనంతరం కప్పస్తంబ ఆలింగనం చెసుకోగా వైధికస్వాములు బేడామంటపంలో అశీర్వచనం పలుకగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం అందజేసి స్వామివారి తీర్ధప్రసాదములు అందజేశారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కంచరపాలెం : కంచరపాలెం పరిది గాంధీ నగర్ వద్ద హెచ్ .పి.సి.ఎల్ , ఎస్సి ,ఎస్టీ వెల్ ఫేర్ అశోషియేషన్ మరియు వక్షర్ట్ పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లబించింది.

వైద్య శిబిరంలో పలువురికి బిపి, షుగర్, రక్త హినత, కంటి పరిక్షలు నిర్వహించిన వైద్యులు ఉచితంగా మందులను అందజేశారు. కారయక్రమంలో బాగంగా పరిశరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ .పి.సి.ఎల్ డి.జి.ఎం బి.ఎల్ రావు, పి.ఆర్.ఓ కాలి, ఎస్సి,ఎస్టీ వెల్ ఫేర్ అశోషియేషన్ అద్యక్షులు క్రాంతి కుమార్, కార్యదర్శి వి.ఆశీర్వాదం, సభ్యులు బి.ఎన్ .ఎస్ కుమార్, కే.విజయ శ్రీనివాస్, నుకరాజు, గాంధీ నగర్ కోలని అద్యక్షులు అప్పరావు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

## సాయంపై రాజకీయం

ప్రకృతి సృష్టించిన వరద బీభత్సంతో సర్వం కోల్పోయిన కేరళకు సాయం అందించటంలో రాజకీయాలు చోటుచేసుకోవటం శోచనీయం. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రకటించిన సాయాన్ని కేంద్రం తిరస్కరించటం బాధాకరం. ఎక్కడైనా ప్రకృతి విపత్తు సంభవించి ప్రజలు జీవన్మరణ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పుడు, వారి జీవితాలను నిలిపేందుకు, కనీస అవసరాలు తీర్చేందుకు అన్నివర్గాల నుంచి సాయాన్ని కోరటం సహజమే. దేశ, విదేశాల నుంచి వస్తున్న సహాయాన్ని స్వీకరించటం సాధారణం. కానీ ఈ విపత్కర పరిస్థితుల్లో యూఏఈ అందిస్తామని చెప్పిన 700 కోట్ల సాయాన్ని కేంద్రం తిరస్కరించటం గర్హనీయం. యూఏఈ సాయం పూర్తిస్థాయిలో నిర్ధరణ కాకముందే యూపీఏ ప్రభుత్వ హయాం లో రూపొందించిన విధాన నిర్ణయానుసారమే యూఏఈ సాయాన్ని తిరస్కరించామని కేంద్రం చెప్పడం మరింత విస్మయం కలిగిస్తున్నది. ఏదైనా విప త్తు తలెత్తినప్పుడు విదేశీ సాయానికి అర్థించకూడదనేది జాతీయ విధానంలో భాగం. కానీ విదేశాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విపత్తు బాధితులకు అండగా ఉంటామంటే, ఆ సాయాన్ని కేంద్రం ఆమోదించొచ్చు అని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ 2016లో రూపొందించిన పత్రంలో విస్పష్టంగా ఉన్నది. అయినా కేంద్రం విదేశీ సాయాన్ని స్వీకరించలేమని తిరస్కరించటం బాధ్యతారాహిత్యమే. ఆపద సమయాల్లో అందరూ ఏకతాటిపై నిలిచి బాధితులకు ఆపన్న హస్తం అందించే బదులు రాజకీయా లు చేయటం మన ఏలికలకే చెల్లింది. ఈ నేపథ్యంలోనే కేంద్రమంత్రి ఆల్ఫోన్స్ కేరళకు అందుతున్న సహాయాన్ని తిరస్కరించటం పట్ల విస్మయం వ్యక్తంచేశారు. సాయాన్ని ఆహ్వానించాలని సీనియ ర్ మంత్రులకు విజ్ఞప్తి చేసి ప్రభుత్వ తీరుపై తన నిరసనను వ్యక్తపర్చటం గమనార్హం. వరద ముప్పు తగ్గి ఇప్పుడిప్పుడే ప్రజలంతా తమ సొంతగూటికి తిరుగు ప్రయాణవుతున్నారు. ఇలాంటివారికి బురదలో మునిగి తమ నివాసాల ఆనవాళ్లు కూడా కనిపించని దుస్థితి ఉన్నది. పం టలు, పశుసంపదలకు కలిగిన నష్టం ఇప్పుడిప్పుడే పూడ్చలేనిది. ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లో రెం డు లక్షల మంది దాకా ఆకలిదప్పులతో అలమటిస్తున్నారు. కట్టుబట్టలతో బతుకుజీవుడా అంటూ పునరావాస కేంద్రాలకు చేరిన వారికి చలినుంచి కాపాడుకునేందుకు దుస్తుల్లేవు. ఇలాంటి దయనీ య పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ చేతనైన రూపంలో సాయం అందించాలి. ప్రాథమిక అంచనాల ప్రకారమే కేరళకు 21వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. కేరళ ప్రభుత్వం తమకు తక్షణ సాయం గా 22 వేల కోట్లు కావాలంటున్నది. ఈ పరిస్థితిలో కేంద్రం 600 కోట్ల సాయం ప్రకటించి చేతులు దులుపుకున్నది. ఇప్పటిదాకా వివిధ వర్గాల నుంచి 530 కోట్ల సాయం అందింది. ఇప్పుడున్న పరిస్థితిలో ఇది ఏ మూలకు సరిపోదు. వివిధ రాష్ట్రాలు కేరళ ప్రజల దుస్థితిని చూసి చలించిపోయి ఇతోధికంగా సాయం అందిస్తున్నాయి. ప్రజలు కూడా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో స్వచ్ఛందంగా కదిలి ఆర్థికంగానే గాక వస్తు, ధాన్యం రూపేణా సహా యం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా బీజేపీ పాలిత రాష్ట్రాలు సాయం చేయటానికి ముందుకు రాకపోవటం విచిత్రం. సాయం అందించటంలో బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలే ముందుండ టం విశేషం. యూఏఈ ఒక దేశంగా మాత్రమే కేరళ వరద బాధితులకు సాయం చేస్తున్నానని చెప్పలేదు. ఆ దేశ పునర్నిర్మాణంలో కేరళీయుల రక్తమాంసాలు, శ్రమ ఇమిడి ఉన్నదనీ పేర్కొనటమే గాక, వారికి ఆపత్కాలంలో సాయమందించటం మానవీయ ధర్మంగా యూఏఈ చెప్పుకున్నది. అలాంటి స్పందనను అనుమానపు చూపుతోనో, నిబంధనల పేరుతోనో తిరస్కరించటం సరికాదు. ఈ యాభై ఏండ్లలో విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ దేశానికి కేరళ అందించిన విదేశీ మార కం వెలకట్టలేనిది. ఒక్క 2017లోనే 75వేల కోట్ల విదేశీ మారకాన్ని అందించారు. విపత్తు సమయాల్లో విదేశీ సాయం అందుకోవటం కొత్తేమీ కాదు. 2004కు ముందు ఉత్తరకాశీ భూకంపం, లాతూర్ భూకంపం, గుజరాత్ భూ కంపం, బెంగాల్ తుఫాన్, బీహార్ వరదల సమయాల్లో దేశవిదేశాల నుంచి వచ్చిన సాయాన్ని అందుకున్నాం. పునరావాస, పునర్నిర్మాణ పనులకు వినియోగించాం. బాధితుల కడగండ్లు తీర్చటానికి జాతి యావత్తూ ఏకతాటిపై నిలిచి కృషి చేసింది. ఆ తర్వాతికాలంలో విచక్షణారహితంగా విదేశీసాయాన్ని స్వీకరిస్తే, దేశ భద్రత, రక్షణ కు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఎదురవవచ్చని భావించారు. 2005లో కశ్మీర్‌లో వచ్చిన భూ కంపం, ఉత్తరాఖండ్ వరదలు, కశ్మీర్ వరదల ఉదంతాల్లో అమెరికా, జపాన్, రష్యా దేశాలు ఇవ్వజూపిన ఆర్థికసాయాన్ని తిరస్కరించారు.

# ఘనంగా సురేంద్ర జన్మదిన వేడుకలు




అనకాపల్లి ... ప్రముఖ సంఘ సేవకులు తెలుగుదేశంపార్టీ విశాఖ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గ నలుమూలల తో పాటు, జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వర్షం పడుతున్నా, పెద్ద ఎత్తున అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలివచ్చి, శుభాకాంక్షలు తెలియజేసారు. స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం ఈ జన్మదిన వేడుకలకు వేదికగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిదులుగా మంత్రి వర్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎంపీ అవంతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గణబాబు, పీలా గోవిందసత్యనారాయణ, ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ప్రముఖ కవి గురజాడ నర్సింహనాయుడు, ముత్తంశెట్టి మహేష్, తదితరులు హాజరై సురేంద్రను గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీడీపీ విశాఖ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాయల మురళీ, డిసిసిబీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, వేగి గోపీకృష్ణ, కొణతాల వెంకటరావు, బిఎస్ఎంకే జోగినాయుడు, పచ్చికూర రాము, పల్లేల నాగేశ్వరరావు, యల్లపు నూకరాజు, ఆడారి కుమారస్వామి, కొణతాల నూకునాయుడు, మళ్ల కృష్ణ, మళ్ల శ్రీరాములు, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి.

పలు సేవా కార్యక్రమాలు ......

సురేంద్ర జన్మదినం పురస్కరించుకుని, నియోజకవర్గంలో ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో మళ్ల రాంబుజ్జి మిత్రమండలి ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం నిర్వహించారు. ఈ రక్తధాన శిభిరానికి పెద్ద సంఖ్యలో యువత హాజరై రక్తం ఇచ్చి సురేంద్రమీద ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. సురేంద్ర మిత్ర మండలి సభ్యులు పట్టణంలో వివిధ కూడలిలో మొక్కలు నాటారు. అలాగే లక్ష్మిదేవిపేటలోని జీవిఎంసీ ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో విద్యార్థుల మధ్య సురేంద్ర కేక్‌ను కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నారు. ఈసందర్భంగా అక్కడ పేద విద్యార్థులకు ఆయన చేతులుమీదుగా బూట్లు, పుస్తకాలు, బ్యాగులు అందజేసారు. గుండాల వీధి జంక్షన్‌లోగల బీసీ హాస్టల్‌లో మధర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఇక్కడ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేసారు. అలాగే నియోజకవర్గంలో పలు చోట్ల అన్నసమారాధన నిర్వహించారు.








## కవి సమయం

### మర్రిచెట్టు

ఊడలు నాటే మర్రిచెట్టులా!
ఎంతో ఘన చరిత్రగలది
కాంగ్రెస్‌పార్టీ
మహావృక్షంలా - వృక్షరాజు ఐ ఉంది
ఈ వృక్ష రాజుకు - చాపక్రింద నీరులా చేరి
అనతికాలంలో ప్రాంతీయ పార్టీలుగా వెలసిల్లే
రెండు నాలుకలతో మాట్లాడే నాగుపాములు
వాడి మీద, వీడు
వీడు మీద వాడు చాడీలు చెప్పుకొనే
దీపావళి టపాస్‌కాయలు
ఒక్కొక్క రాష్ట్రానికి
ఒక్కొక్క కళియుగరావణాసుడు గానో!
నరకాసురుడుగానో! తయారై
కాంగ్రెస్ ప్రగతిని - సుస్థిర స్థానాన్ని
భూస్థాపితం చెయ్యాలని చూస్తున్న
చీడపురుగులు
రాష్ట్రాన్ని - రంపపు కోతకోసి
మధ్య తరగతి కుటుంబీకులను
పీడించే - చండాలులు
వీరి మాటలు - చేష్టలు
విన్నా - కన్నా - చెడుగ ప్రవర్తించినా!
ప్రజాభిష్టంపై - భూస్థాపితం తథ్యం
ఈ సంక్షోభానికి కారకులెవ్వరు?
ఆ వెన్నుపోటు దారులెవ్వరు?
ఈ మధ్య తరగతి కుటుంబీకులను
ఆదుకున్న దెవ్వరు?
నువ్వేగదా! మర్రివిత్తువై ఇంతింతై
అంతై మర్రిచెట్టువై
నీ ఊడలు పెకిలించే నరకాసురులను
పధజర్పిన నాడే - నీ స్థానం - సుస్థిరం

రచయిత
యల్.సిద్ధూ

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : పూరి&ణమ సా.4..09; ధనిష్ట మ.12.41; రా.వ.8.32ల 10.16.

ఆదివారం 26-08-2018

a **మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

b **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖు లతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

c **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

e **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయా ణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ ులు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

i **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

j **మకరం** :ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

k **కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారులను ఆకట్టు కుంటారు.

L **మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి.



# పురాణాలలో స్త్రీ పురుష అంతర్భేద కథలు

## సంకీర్తన

**భారత దేశంలో** స్త్రీల పట్ల వివక్ష చూపిస్తారని ఒక అపవాదు ఉంది. కానీ మీరు చరిత్ర ని తిరగేస్తే ఇది నిజం కాదని స్పష్టమవుతుంది. పురాణాలలో ఈ సంప్రదాయానికి వ్యతిరేక ఉదాహరణలు బోలెడు కనిపిస్తాయి. అనేక సందర్భాలలో స్త్రీ పురుష తత్వాల మధ్య విభజన రేఖ అస్పష్టం గా ఉండటం మీకు కనపడుతుంది..పురాతన కవులు, రచయితలు ఈ స్త్రీ పురుష వివక్ష ని ధైర్యంగా తరచి చూసి ఒక్కోసారి మార్చడానికి కూడా ప్రయత్నించారు. మీ కర్మానుసారం మీరు ఆడ, మగ గానో, జంతువుగానో లేదా చెట్టుగానో పుడతారు. ఎలా పుట్టినా మృత్యు సమయం లో ఆత్మ జీర్ణ వస్త్రాన్ని విడిచిపెట్టినట్లు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. అందుకే ఆత్మ స్త్రీ లేదా పురుష లింగం కాదు. ఇప్పుడు మనం హిందూ పురాణాలలో లింగ వివక్ష కి అందని కథలు చూద్దాము. ఈ కథలలో మగవారు ఆడవారి పాత్ర పోషించడానికి సిద్ధపడ్డ సంఘటనలు,మగవారు గా బ్రతికిన ఆడవారు,ఇంకా ఆడా మగా ఒకటే అని నిరూపించే కథలని చూద్దాము. ఇవి చదివి మీ భావాలని, కామెంట్లని దిగువ తెలియ చెయ్యడానికి సంకోచించకండి.

**అర్ధనారీశ్వరుడు:** అర్ధనారీశ్వర శబ్దానికి సగం స్త్రీ సగం పురుష తత్వం కలిగిన భగవంతుడని అర్ధం. మహా శివుడు మరియు ఆయన దేవేరి పార్వతి యొక్క ఏక రూపం ఈ అర్ధనారీశ్వరం. ఈ రూపం పురుష స్త్రీ తత్వాల ఏకీకరణకి ప్రతీక. ఒకళ్ళు లేకుండా ఇంకొకళ్ళు లేరూని, ఒకళ్ళు ఇంకొకళ్ళ కంటే ఎక్కువ కాదు అనీ, మరియు తనలో ఈ రెండు లక్షణాలనీ ఉంచుకున్నవాడే పరిపూర్ణ జీవితం గడపవచ్చనీ ఈ రూపం మనకి తెలియచేస్తుంది.

మోహిని శ్రీ మహా విష్ణువు అవతారం గా మోహినీ అవతారం మనకి హిందూ పురాణాలలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఈ రూపాన్ని గురించి మూడు ముఖ్య కథలు చెప్తారు. మొదటిది సాగర మధనం తరువాత అమృతానికి సంబంధించిన తగవు తీర్చడానికి వచ్చిన రూపం. శ్రీ మహా విష్ణువు అందమైన మోహినీ రూపం ధరించి తెలివిగా అమృతాన్ని దేవతలకి మాత్రం పంచుతాడు. రెండోది పరమేశ్వరుణ్ణి భస్మాసురుడు అనే రాక్షసుడి బారి నుండీ కాపాడిన మోహినీ అవతారం.ఈ మనోహరమైన మోహినీ అవతారం భస్మాసురుడు తననను తాను అంతం చేసుకునేటట్లు చేసింది. మనోహరమైన మోహినిని పరమేశ్వరుడు మోహించడం వల్ల అయ్యప్ప జననమయ్యింది. అయ్యప్ప దక్షిణ భారతం లో ప్రసిద్ధి చెందిన భగవత్ స్వరూపం. ఇంక మూడోది మహా భారతంలో. అర్జునుడి కొడుకైన అరవనుణ్ణి యుద్ధం లో పాండవుల విజయం కోసం బలి ఇవ్వ వలసి వస్తుంది.కానీ అరవణుడికి చనిపోయే ముందు వైవాహిక సుఖాలని అనుభవించాలని కోరిక ఉంటుంది.కానీ చావు రాసి పెట్టి ఉన్న ఈ మనిషి ని పెళ్ళాడేందుకు ఏ స్త్రీ ముందుకురాకపోయేసరికి శ్రీ కృష్ణుడే మోహినిగా మారి అరవనుణ్ణి పెళ్ళాడి అతను చనిపోయాకా దుఃఖిస్తాడు.శిఖండి ద్రుపద మహారాజుకి కుమార్తె గా పుట్టిన శిఖండి ని మగ పిల్లవాడిలాగ పెంచుతారు. కొన్ని కథల ప్రకారం శిఖండి కి అమ్మాయినిచ్చి పెళ్ళి చేసారుట కూడా. శిఖండి తన స్త్రీ తత్వాన్ని తాను వైవాహిక జీవితం గడపడానికీ , భీష్ముడిని చంపటానికీ ఒక యక్షునికిచ్చినట్లు కూడా కొన్ని కథలు ప్రచారం లో ఉన్నాయి. చాలా కథల ద్వారా శిఖండి ఆడా ఉభయ లింగం అని తెలుస్తుంది. బృహన్నల తనని తిరస్కరించాడన్న కోపం తో ఊర్వశి అర్జునుడిని ఒక సంవత్సరం స్త్రీగా మారతాడని శపిస్తుంది.కానీ ఈ శాపం అజ్ఞాతవాసం ఆఖరి సంవత్సరం లో విరాట మహారాజు కొలువులో బృహన్నల అనే స్త్రీలా ఉండటానికి ఒక వరంలా పనికొచ్చింది. కానీ కొంతమంది ఆ శాపం వల్ల అర్జునుడు స్త్రీగా కాకుండా నపుంసకుడిగా మారాడని కూడా అంటారు. పరమశివుడి తోట లోకి అనుమతి లేకుండా పొరపాటున ప్రవేశించడం వల్ల తన జీవితం లో సగ భాగం స్త్రీగా మారతాడని మగవాడిగా పుట్టిన సుద్యుమ్నుడికి శాపం వచ్చింది. అతను ప్రతీ నెలా తన తత్వాన్ని(లింగాన్ని) మార్చుకుంటుం డేవాడు. అతని స్త్రీ స్వరూపాన్ని ఇల గా వ్యవహరిస్తారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# సినీ నటి అంజలీదేవి జయంతి

పెద్దాపురం: ప్రముఖ సినీనటి,పెద్దాపురం వాస్తవ్యురాలు అయిన అంజలీదేవి జయంతి పెద్దాపురం ఫేస్‌బుక్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించారు. పాత బస్టాండు వద్ద గల ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంజలీదేవి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ అవయవదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఫేస్‌బుక్ సభ్యులు ప్రశాంత్, నవీన్, నాని, నారాయణ, ప్రవీణ, బాబి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంకల్పయాత్రను
# విజయవంతం చేయండి

కార్యకర్తలుకు అధీప్‌రాజ్ పిలుపు



పరవాడ: వైయస్ కాంగ్రెసు పార్టి అద్యక్షులువైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర పెందుర్తి నియోజకవర్గ పరిధిలో వస్తున్న సందర్భంగా నియోజకవర్గ పరిధిలో గల పార్టీ శ్రేణులు అందరూ విచ్చేసి అఖండ ఘనస్వాగతం పలక వలసింది గాను మరియు సబ్బవరం జంక్షన్ లో జరుగు జగన్ బహిరంగ సభకు జనసమీకరణ చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఇసి సభ్యులు పైల శ్రీను వాసురావు, పరవాడ తాజా మాజీసర్పంచ్ చుక్క రామునాయుడు, వైసిపి పరవాడమండలపార్టిఅద్యక్షులు సిరపురపుఅప్పలనాయుడు, తెలుగు యువత అద్యక్షులు పెదిశెట్టిశేఖర్, కూండ్రపు సీతా రామయ్య, బొంది అచ్చిబాబు, బురద రాజు ,పైల అప్పల నాయుడు, బండారు రామారావు, చల్లా కనకారావు, బొద్దపు చిన్నారావు, బురదరాజు, వెన్నెలనర్సింగ్ రావు, కూండ్రపు తాతాజీ, గెడ్డం ఉమ, పైల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతి విగ్రహం ప్రతిష్ట


భీమునిపట్నం : స్థానిక చిన్నబజార్ 23 వార్డ్ యోగానంద వీధిలో శనివారం ఉదయం సిద్ధి గణపతి విగ్రహం ప్రతిష్టించారు. ఈ రోజు ఉదయం ఆరు గంటలనుంచి విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి 11.15 ని.లకువిగ్రహం ప్రతిష్టించారు.అనంతరం అన్నసమరాదన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ అభివృద్ధి కమిటీ అద్యక్షులు దారపు అప్పారావు,సభ్యులు ఆద్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వేతన సవరణపై ఉద్యమిస్తాం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వ తిరోగమన వైఖరి మూలంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు మూతపడే దశకు చేరుకున్నాయని సుమారు 9.5 లక్షల కోట్ల రూపాయల నిర్ధాయక ఆస్తులు మూలంగా దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థ కుదేలుగా మారిందని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.ఉదయభాస్కర్ విమర్శించారు. శనివారం ప్రముఖ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను, దేశీయ బ్యాంకులను సమూలంగా నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు విదేశీ కార్పొరేట్ విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. బ్యాంకులు విలీనం మూలంగా నష్టమే సంభవిస్తుంది గాని, ప్రభుత్వం చెప్పినట్లు లాభదాయం కాదన్నారు. బ్యాంకుల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో బ్యాంకింగ్ యూనియన్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, బి.ఎస్.రాం బాబు, వై.శ్రీనివాసరావు, నాయక్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# పాత ఆర్డీవో కార్యాలయం కూల్చివేత



పెద్దాపురం: బ్రిటీష్ కాలం నాటి 111 సం॥ చరిత్ర కలిగి పురాతన ఆర్‌డిఓ కార్యాలయం కూల్చివేతపై సోషల్ మీడియా ఫర్ సొసైటీ తూ॥గ॥ జిల్లా అధ్యక్షులు ఎం.డి.ముక్తర్ ఆలీ నిరసన వ్యక్తం చేశ్యారు. శనివారం సాయంత్రం 4గంటల సమయంలో పోలీసు బందోబస్తుతో పాత ఆర్డీవో కార్యాలయం గేటుకి తాళాలు వేసి, జెసిబితో భవనాన్ని కూల్చివేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.ఇ.కృష్ణమూర్తి మే 31న పెద్దాపురం ఎంఆర్‌వో, ఆర్‌డివో నూతన భవనాల శంకుస్థాపనకు వచ్చినప్పుడు, పురాతన భవనాన్ని కూల్చే ఉద్ధేశ్యం ప్రభుత్వానికి లేదని, అందుచేత పెద్దాపురం పురాతన ఆర్డీవో కార్యాలయం, చారిత్రాత్మక సంపద కాపాడడం జరుగని హామీ ఇచ్చారని ఆలీ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి వాగ్ధానాన్ని ప్రభుత్వం తుంగలో తొక్కి చారిత్రాత్మక సంపద కూల్చడం అన్యాయమని ఆలీ అన్నారు. ఈ విషయమై యస్ఐ కృష్ణభగవాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకే పురాతన కట్టడం కూల్చడం జరుగుచున్నదని, ఆందోళన చెందవలసిన పనిలేదని తెలిపారు.

భవన ప్రాంగణంలో భారీగా పోలీసు బందోబస్తుతో పాటు, ప్రభుత్వ సిబ్బంది వుండి గేటు తాళాలు తీయడానికి నిరాకరించారు.

# శ్రీ చైతన్యలో సోదరా నీకు శుభమస్తు



శ్రీచైతన్య రాఖీలు కడుతున్న చిన్నారులు

నర్సీపట్నం : స్థానిక శ్రీచైతన్య ఆంగ్లమాధ్యమ పాఠశాలలో అట్టహాసంగా సోదరా నీకు శుభమస్తు అంటూ అన్నదమ్ములకు ఆడపిల్లలు రాఖీలు కట్టారు. సభను ప్రారం భించిన పాఠశాల ప్రిన్సిపాల్ మండ సూర్య నారాయణమూర్తి మాట్లాడుతూ సాంస్కృతిక సంప్రదాయాలకు భారతదేశం పుట్టి నిల్లన్నారు. తోబుట్టువులకు అన్నింటా విజయం కలగాలని, వారు అజేయులు కావాలని ఎల్లప్పుడు తమకు అండగా వారి అన్న దమ్ములు ఉండాలని కోరుకుంటూ ఆడ పిల్లలు అన్నదమ్ములుకు రాఖీలు కడు తుంటారని వివరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో అమ్మాయిలు వారి వారి అన్న దమ్ములకు రాఖీలు కట్టి మిఠా యిలు తిని పించారు. తర్వాత ఆశీర్వచనాలు తీసు కున్నారు. అక్కచెల్లెళ్లు వారి అన్న దమ్ములిచ్చే బహుమతులు చూసుకుంటూ మురిసి పోయారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు చూపరు లను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సంతోష్, ప్రాంతీయ సంచాలకులు మాకిరెడ్డి రమణ, ఇన్‌చార్జ్ సురేంద్ర, మైథిలి, సత్యప్రభ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చంద్రన్న పెళ్ళికానుక పంపిణీ



భీమునిపట్నం : భీమిలి డివిజన్ బ్యాంక్ కాలనీలో వివాహం చేసుకున్న షేక్ షాయిరా,షేక్ షాకీర్ కు చంద్రన్న పెళ్ళికానుక ఏభైవేలు బాండ్ ను భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా.నూకరాజు అందజేశారు ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు పేద తల్లిదండ్రులకు ఆడపిల్ల వివాహం బారం కాకూడదనే సహుద్దేశ్యంతో ఈ చంద్రన్న పెళ్ళికానుక పెట్టారని ఈ పథకం ఎంతో మందికి ఉపయోగపడుతోందని అన్నారు. ఇందుకు గాను బి.సిలకు రూ.35వేలు, ఎస్.సి,ఎస్.టి లకు రూ.50 వేలు, అదేవిధంగా 80% అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు రూ.లక్ష ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వివాహానికి రెండు వారాల ముందుగా ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

అలాగే తగరపువలస డివిజన్ ఏడవ వార్డ్ కు చెందిన రవ్వ నాగవల్లి, గుడివాడ.నరసింగరావు దంపతులకు తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పల. రమేష్,రవ్వ వెంకటరావు లు ముప్పయివేలు బాండ్ ను అందజేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాసరపు నాగరాజు, గూడపురాజు, గిడుతూరి.శ్రీనివాసరావు కృష్ణారావు మాష్టర్, రఘు పెళ్ళి మిత్ర యల్మాజి తదితరులు పాల్గొన్నారు.

## కేరళ వరద బాధితుల సహాయార్ధం
# విరాళాల సేకరణ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం : మున్సిపల్ చైర్ పర్శన్ చింతకాయల అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు ఆధ్వర్యంలో కేరళ వరద బాధితుల సహాయార్ధం నర్సీపట్నంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ అందరూ ఏకతాటిపైకి వచ్చి ఎవరికి తోచినంతగా వారు సహాయం చేసి కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. ఎన్నడూ లేని విధంగా వరదల ధాటికి కేరళ రాష్ట్రం భారీగా నష్టపోయిందన్నారు. ఈ సమయంలో వారికి బాసటగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.. ఈ ర్యాలీలో, నూకాలమ్మతల్లి ఆలయ చైర్మన్ మాకిరెడ్డి అప్పారావు, నర్సీపట్నం మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లు, లయన్స్ క్లబ్, నవ్యలన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్, రోటరీ క్లబ్ షిర్డీ సేవా సంఘం, దుర్గామల్లేశ్వర ఆలయ కమిటీ, డీలర్స్ అసోసియేషన్, బిల్డర్స్ అసోసియేషన్, ప్రైవేటు కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్ పాదయాత్రకు
# అనూహ్య జనాధారణ




పాదయాత్రలో జగన్‌తో సెల్ఫీలు దిగుతున్న యువతులు

యలమంచిలి రూరల్ : యలమంచిలి నియోజకవర్గంలో వైసిపి అధినేత, రాష్ట్ర ప్రతిపక్ష నేత వైయస్.జగన్మోహనరెడ్డి పాదయాత్రకు అనూహ్య స్పందన లభిస్తుంది. శుక్రవారం సాయంత్రం బహిరంగ సభ అనంతరం రాత్రి బస చేసిన జగన్ తిరిగి శనివారం ఉదయం యలమంచిలి నియోజకవర్గం కొనసాగుతుంది. జగన్‌కు మహిళలు బ్రహ్మరథం పడుతున్నారు. యువతులు జగన్‌తో సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడ్డారు. ఈ పాదయాత్రలో పార్టీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, అనకాపల్లి పార్లమెంట్ కోఆర్డినేటర్ వరుదు కళ్యాణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంపిణీకి సిద్దంగా చిల్లీ జింక్

రోలుగుంట : రైతులకు పంపిణీ చేయడానికి చిల్లీ జింక్ బ్యాగులు సిద్దంగా ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి పి.విజేత తెలిపారు. ఏపి మార్క్ఫెడ్ నుంచి చిల్లీ జింక్ సంచులు వచ్చాయన్నారు.



## ప్రశాంతి విద్యాసంస్థలో
# ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు


అచ్యుతాపురం : విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆలక్ష్య సాధనకు కృషి చేయాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఆర్‌డి.భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ప్రశాంతి విద్యాసంస్థల్లో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా, ధృడంగా ఉన్నప్పుడే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చునన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులు బిడియంను విడనాడాలన్నారు. సాంకేతిక, ఐటిఐ చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా వుంటాయని, విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. రిటైర్డ్ నేవీ అధికారి పాలినాటి వెంకట్ మాట్లాడుతూ రక్షణ రంగంలో సాంకేతిక విద్యాపరంగా మంచి అవకాశాలున్నాయన్నారు. ప్రశాంతి విద్యాసంస్థల అధినేత ధర్మిరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యతతో కూడిన సాంకేతిక విద్యనందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనువాసరావు, ఐటిఐ ప్రిన్సిపాల్ వెంకటరావు, అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలు కాదు పరిష్కారం చెప్పండి

- అధికారులతో మంత్రి అయ్యన్న పాత్రుడు
- ఇంజనీరింగ్ పనులు నత్తనడకన పై అసంతృప్తి
- అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసేందుకు తగిన పరిష్కారం చెప్పాలని, జాప్యానికి గల కారణాలు కాదని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు అధికార్లను ఆదేశించారు. నియోజకవర్గంలో అమలు చేస్తున్న ఇంజనీరింగ్ పనుల పురోగతిపై ఆయన శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, రహదారులు భవనాలు, పురపాలక సంఘం పరిధిలో జరుగుతున్న పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, నిధులు విడుదల చేసినా పనులు పూర్తి కావడం లేదని, పర్యవేక్షక ఇంజనీర్‌లు దీనిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. కొన్నిచోట్ల పనులు కూడా మొదలు పెట్టలేదని, మరికొన్ని మధ్యలో నిలిపివేశారని, అందుకు గల కారణాలను అడిగితే పొంతనలేని సమాధానాలు వస్తున్నాయంటూ ఆర్అండ్‌బి, పిఆర్ ఎస్ఇలకు వివరించారు. నర్సీపట్నం ఇండోర్ స్టేడియం, వెంకటేశ్వరస్వామి ఆలయం నుండి కొత్తవీధి గుండా వెళ్లే రోడ్డు, పంచాయతీరాజ్ అతిధి గృహం, నాతవరం జోగంపేట రహదారి, తాళ్లపాలెం నర్సీపట్నం రోడ్డు అభివృద్ధి, శారదా నగర్ రోడ్డు అభివృద్ధి, లింగాపురం రోడ్డు మొదలైనవాటిపై క్షుణ్ణంగా చర్చించారు. అధికారులు పరస్పర సహాయ సహకారాలతో ప్రణాళిక ప్రకారం పనులు నిర్వహిస్తే సకాలంలో పూర్తి చేయొచ్చు అన్నారు. అవసరమైతే అదనపు నిధులు మంజూరు చేస్తున్నామని, ఉన్నతాధికారులకు మంజూరు అధికారాలను పెంచామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వివిధ వంతెన, రోడ్డు పనులు జాప్యం చేయడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు అన్నారు. అధికారులకు ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే వెంటనే తనకు తెలియజేయాలన్నారు. భూముల విషయంలో రెవిన్యూ శాఖ వెంటనే చర్యలు తీసుకుంటుందని, ఇసుక లభ్యతను బట్టి వారికి రవాణా చార్జీలు చెల్లించాలన్నారు. పట్టణ గృహ నిర్మాణ పథకంలో 2592 ఇల్లు మంజూరు అవగా 1600 గ అహాలకు లబ్ధిదారులు డిపాజిట్ కట్టారని మున్సిపల్ కమిషనర్ తెలియజేయగా, ఈ విషయంలో ప్రజలకు పూర్తి అవగాహన కలిగించాలన్నారు. వివిధ కాలనీలలో స్థలాల అక్రమ అమ్మకాలు, ఆక్రమణలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పెదబడ్డేపల్లి నర్సీపట్నం లను కలిపే పెద్ద మదుం వద్ద పాత బ్రిడ్జి ప్రాంతంలో మరో బ్రిడ్జి మంజూరైందని, ఆ ప్రాంతంలో ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ప్రభుత్వ భూముల లో ఇల్లు నిర్మించుకుని ఎంతోకాలంగా నివసిస్తున్న వారికి రెగ్యులర్ చేయాలని, నిబంధనల ననుసరించి అటువంటివారిని గుర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి వి విశ్వేశ్వరరావు, పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు వి వేణుగోపాల్, ఆర్అండ్‌బి పర్యవేక్షక ఇంజనీరు పి.మురళీక అష్ణ, కార్యనిర్వహక ఇంజనీర్లు రమేష్ కుమార్, గోపీనాథ్, డిప్యూటీ ఇంజనీరు వేణుగోపాలరావు, పిఆర్ డిప్యూటీ ఇంజనీరు సత్యంనాయుడు, నర్సీపట్నం తహశీల్దార్ వివి.రమణ, మున్సిపల్ కమిషనర్ జే.సురేంద్ర, టిట్కో ప్రతినిధులు, కెమెరా ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ గౌరవ గాజువాక జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు**

**O.S. 77/2018**

**Between**
**Asu Padmavathi** ... వాది
**And**
**Aripaka Sanyasamma** ... ప్రతివాది
**To**
**Aripaka Sanyasamma, W/o.Sarveswara Rao,**
**House wife, Hindu, aged 49 years, Residing at D.No.49-24-5, Madhuranagar, Visakhapatnam-530016.**

పైన పేర్కొన్న దావా పరిహారం నిమిత్తం మీ మీద పై వివరించిన వాజ్యము వాది దాఖలు చేసినందువలన సదరు పై దావాకు ప్రత్యుత్తరము తెలుపుటకు **తేది 2018వ సంవత్సరం సెప్టెంబర్ నెల 7వ తారీఖున ఉదయం 10.30 లకు** స్వతహాగా లేక సరి అయిన భోగట్టా యివవ్వబడిన వకీలు ద్వారా లేక సరి అయిన ఏజెంటు ద్వారా పై తెలిపిన కోర్టుకు హాజరు అయ్యేటట్లు యిందుమూలముగా మీకు ఆజ్ఞాపించడమయినది.

పై చెప్పబడిన దినము నందు మీరు హాజరు కాని ఎడల మీ పరోక్షమందు పై వాజ్యమును విమర్శన చేసి తీర్మానించుటమగునని మీరు తెలుసుకోవలసినది.

**(By Court Order)**

**R.VISWANATH**
**(advocate for Plaintiff)**
**Gajuwaka**
**VSP-26.**

## ప్రభుత్వ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### ప్రభుత్వ విప్ కిడారి సర్వేశ్వరరావు



అనంతగిరి: శనివారం ప్రభుత్వవిప్ కిడారి సర్వేశ్వరరావు పెదలబుడు పంచాయతీ అరకువ్యాలీ మండలంలో గిరిజన రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. మరియు ఐసిడిఎస్ స్టాఫ్‌కు మీటింగ్ హాల్‌కు శంకుస్థాపన చేసి గోష్ఠి గెస్ట్ హౌస్‌లో  ఐసిడిఎస్ స్టాఫ్ అందరితో సమావేశంలో పాల్గొనడం జరిగింది.



*మాడుగుల నియోజకవర్గం దేవరపల్లి మండలం కొత్తూరు ముత్యాలమ్మ పాలెం గ్రామంలో అగ్ని ప్రమాదంలో అయిదు పశువులు కాలి మరణించాయి. జిఎస్ఎన్ ఛారిటబల్ ట్రస్ట్ చైర్మన్ వైకాపా సీనియర్ నాయకుడు గవిరెడ్డి సన్యాసినాయుడు బాధితులను పరామర్శించి 12,000 రూపాయిలు ఆర్థిక సహాయం అందజేశారు.  ఈ కార్యక్రమంలో సభ్యులు కే కోటపాడు మండలం  మాజీ జడ్‌పిటిసి కసిరెడ్డి అప్పల్నాయుడు, గేదల జగన్నాధం, పెంటకోట రమేష్, రామకృష్ణ, వంటాకు రాము, లెక్కలు పైడం నాయుడు, తదితరులు పాల్గొన్నారు*

## 27న భూలోకమాంబ అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవం

### పరవాడ తాజా మాజీ సర్పంచ్ చుక్క



పరవాడ: పరవాడ గ్రామం లో బీసీ కోలని, ప్రభుత్వ బాలికల వసతి దగ్గర వెలిసిన భూలోకమాంబ అమ్మవారి ఆలయం 27వ తేదీన ఉదయం 10:00 గంటలకి ప్రారంభోత్సవం జరుగుతుందని పరవాడ తాజా మాజీ సర్పంచ్ చుక్కరామునాయుడు తెలిపారు. శనివారము అయన విజయభాను ప్రతినిదితో మాట్లడుతూ సోమవారము భూలోకమాంబ అలయము ప్రారంభం జరుగుతుందిని అందులో భాగంగా ఆదివారం సాయంత్రం 4:00 గంటలకు పరవాడ ఊరిలో నుంచి గ్రామ ప్రజలు,గ్రామ పెద్దలులతో అమ్మవారి ప్రతిమలు, కలశంలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని తరువాత 5:00 గంటల నుంచి అమ్మవారికి ఐదుగురు దంపతుల చేతులు మీదగా హోమం, పూజ కార్యక్రమాలు జరిపి సోమవారము ఉదయం 10:00 గంటలకి వేద పండితులు రాజ్యశ్రీ రామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయం లోని అమ్మవారి విగ్రహా ప్రతిష్ట జరుపబడు తుందని అన్నారు. అనంతరం ఆలయంకు విచ్చేసిన భక్తులకు గుడి పరిసర ప్రాంతా ప్రజల సహకారంతో అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, భక్తులు అందరు విచ్చేసి ఈ కార్యక్రమాలు అన్నింటిని విజయవంతం చేయాలని పరవాడ తాజా మాజీ సర్పంచ్ చుక్కరామునాయుడు తెలిపారు.

## ఉచిత హెూమియో వైద్యసేవలు

విశాఖపట్నం : ప్రతీ నెల ఆఖరు ఆదివారం "స్ఫూర్తి" స్వచ్ఛంద సేవా సంస్థ వారు అందిస్తున్న ఉచిత వైద్య సేవలో భాగంగా ఈ రోజు పెందుర్తి, సరిపల్లి గ్రామంలో ఉన్న స్ఫూర్తి సేవా సదన్ భవనంలో ఉదయం 9 .30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత హెూమియో వైద్య శిబిరం నిర్వహించబడును. ఈ శిబిరానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.వి.భాస్కర్ హాజరై రోగులను పరీక్షించి తగు సలహాలిచ్చెదరు. సేవా సంస్థవారు రోగికి కావలసిన మందులను ఉచితంగా అందచేస్తారని ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని సేవాసంస్థ కార్యనిర్వాహక ధర్మకర్త నీలి జగదీశ్ కోరుతున్నారు.

## కేరళ బాధితులకు రైస్‌ఎక్స్‌పోర్టర్స్ ఆపన్నహస్తం




కాకినాడ : రైస ఎక్స్‌పోర్టర్స్ అసోసియోషన్ సమకూర్చిన 144 టన్నుల బియ్యాన్ని కేరళ బాధితులకు పంపారు. శుక్రవారం కాకినాడ డైరీఫాం కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో బియ్యం లారీలను కలెక్టర్ కార్తికేయ మిశ్రా, చాగంటికోటేశ్వర రావులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కేరళ బాధితులకు ఆపన్న హస్తం అందించేందుకు బియ్యం, దుపట్లు, బట్టలను సమకూర్చిన రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియోషన్‌ను అభినందించారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం అనే మంచి అలవాటు జిల్లా వాసులకు ఉందన్నారు. తనతో పాటుగా ఐఎఎస్ శిక్షణ పొందినవారు కేరళలో పనిచేస్తున్నాని వారి అభ్యర్ధన మేరకు జిల్లా నుండి సహాయం పపిస్తున్నామన్నారు. జిల్లా నుండి ఓఎన్‌జీసీకి చెందిన ఒక హెలీకాప్టర్‌ను పంపడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 7లారీల బియం పంపడం జరిగిందన్నారు.

ఆధ్యాత్మిక తత్వవేత్త చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ కష్టాలో ఉన్న కేరళ వరద బాధితులకు ఆకలితీర్చేందుకు బియ్యం పంపించేందుకు సంకల్పిం చిన సంఘు సభ్యులను అభినందించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకొంటే భగవంతునికి సేవచేసినట్లేనన్నారు. సంఘు అధ్యక్షులు బివి.కృష్ణారావు మాట్లాడుతూ సుమారురూ.55లక్షల విలువైన 144 టన్నుల బియ్యం,10వేల దుప్పట్లను పంపిస్తున్నాట్లు చెప్పారు. అలాగే వీటిని బాధితులకు అందజేసేందుకు 15మంది వాలంటీర్ల ను కూడా పంపిస్తున్నట్లు తెలిపారు.రైస్‌ఎక్స్‌పోర్టర్స్ సంఘు అధ్యక్షులు అంబటి రామకృష్ణారెడ్డి,కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్‌పి.నాయుడు, ఉపాధ్యక్షుడు చిట్నీడి శ్రీనివాస్,కార్యదర్శి వినోద్ అగర్ వాల్, ఆర్డీవో రఘుబాబు,తాహశీల్దారు వరహాలయ్య, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్ సాయం



అమలాపురం : కేరళ వరద బాధితులకు అమలాపురం మండల పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్ సాయం అందించింది. శనివారం నాడు కేరళ వరద బాధితుల సహాయార్థం అమలాపురం ఆర్‌డివో బి.వెంకట రమణ సమక్షంలో పీఎంపీ, ఆర్ఎంపీ సభ్యులు 13 బస్తాల బియ్యాన్ని ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షులు యల్లమిల్లి కొండకి అందజేసారు. కేరళ వరద బాధితులకు పూర్తి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

మండల అధ్యక్షులు వి.రామ్మోహన రావు, సెక్రటరీ పి.సంపదరావు, ట్రెజరర్ ఐ.సత్యం, గౌరవాధ్య క్షులు యు.వి.రావు, ఆర్.వెంకటేశ్వర రావు, ఎం.సాయిబాబు, ఎన్.రాజశేఖర్, జి.శ్రీను, ఎస్‌కె.ఖాన్, కుడుపూడి రమ ణ తదితరులు పాల్గొన్నారు.

## భావితరాలవారికోసమే విజ్ఞాన గ్రంథాలయం : బాదం

### బాదం గ్రంథాలయానికి అద్భుత గ్రంథాలను అందజేసిన నిమ్మలపూడి వీర్రాజు



కాకినాడ: రాజమండ్రికి చెందిన నిమ్మలపూడి పద్మావతి జ్ఞాపకార్థం శ్రీరామ భక్త గానసభ వ్యవస్థాపకులు నిమ్మలపూడి వీర్రాజు విలువైన సుమారు 500 గ్రంథాలను అభ్యుదయా ఫౌండేషన్ ఛైర్మన్ బాదం మాధవరావుకు శనివారం ఉదయం స్థానిక గాంధీనగరంలో వున్న ఆయన స్వగృహంలో అందజేసారు. ఈ సందర్భంగా నిమ్మలపూడి వీర్రాజు మాట్లాడుతూ గోవిందరాజు వ్యాఖ్యానంతోకూడిన రామాయణం గ్రంథాలతోపాటుగా సాంస్కృతిక ఆధ్యాత్మిక, ఆరోగ్య అంశాలతోకూడిన అనేక పుస్తకాలను అందజేయడం జరిగిందని చెప్పారు. మహాత్మాగాంధీ జీవిత చరిత్ర, స్వామి వివేకానందా సాహిత్యం వంటి అమూల్యమైన పుస్తకాలు వీటిలో ఉన్నాయని చెప్పారు. బాదం మాధవరావు నిర్వహిస్తున్న గ్రంథాలయంలో ఈ పుస్తకాలు ఉంచడం ద్వారా వీటి అమూల్య సంపద భావితరాలవారికి అందుతోందన్న ఆత్మతృప్తి కలుగుతోందని చెప్పారు. సంపద మరియు సత్‌సంకల్పం రెండు మేళవించిన బాదం మాధవరావు నేతృత్వంలో ఈ గ్రంథాలయంలో అభివృద్ధి చెందుతుందన్న విశ్వా సాన్ని ఆయన ప్రకటించారు. ఆయన చేస్తున్న సాహిత్య సాంస్కృతిక ఆధ్యాత్మిక సేవలను చూడ్డం జరిగిందని ఇటువంటి వ్యక్తికి అమూల్యమైన పుస్తక సంపదను అందజేయడం సరైన నిర్ణయంగా తాను భావించానని చెప్పారు. గత మూడు దశాబ్దా లుగా తన వద్ద వున్న విశేషమైన పుస్తకాలను బాదం గ్రంథాల యానికి అందించడం ద్వారా గ్రంథాలయఉద్య మానికి తన వంతు సేవ చేసానన్న తృప్తి కలిగిందని అన్నారు.

బాదం మాధవరావు మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ బాదం అప్పారావు గుప్తా సెంటినరీ సెలబ్రేషన్స్ సందర్భంగా నాలుగు సంవత్సరాల క్రితం పిఠాపురంలో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసానని చెప్పారు. జిల్లాలో రాజమండ్రిలో గౌతమీ గ్రంధా లయం కాకినాడలో ఈశ్వర పుస్తక బాండాగారం, పిఠాపురంలో సూర్యాలయ గ్రంథాలయం ప్రాచుర్యంలో ఉందని వాటికి సమానంగా బాదం గ్రంథాలయాలన్ని అభివృద్ధి చేయదల్చానని చెప్పారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో 6వేల పుస్తకాలకు పైగా ఉంచడం జరిగిందని అన్నారు. ఐ.ఎ.ఎస్. ఐ.పి.ఎస్, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను ఏర్పాటుచేసామని, దానితోపాటు సంస్కృతి ఆధ్యాత్మికం వంటి విషయాలు తెలుసుకోవడానికి అవసరమైన గ్రంథాలను కూడా ఉంచడం జరిగిందన్నారు. రానున్న తరానికి మన చరిత్రతోపాటు మన సంస్కృతిసంప్రదాయాలకు వీలుగా గ్రంథాలను నిక్షిప్తించేయడం జరిగిందన్నారు. ప్రతీ ఒక్కరు వారివారి ప్రాంత చరిత్రను తెలుసుకోవల్సిన అవసరం ఉందని మానవ జీవితాన్ని ప్రభావితం చేయగల పుస్తక విజ్ఞానం నేడు క్రమంగా మరుగున పడడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేసారు. మన మూలాలు మనకు తెలియపర్చే గ్రంథాలను అధ్యయనం చేసే అలవాటును తెలియ పర్చడంలో నేటి తరం ప్రత్యేక శ్రద్ధతీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.కార్యక్రమంలో బాదం సూర్య ప్రకాష్, యాతగిరి పరశు రామ్, వంశితోపాటు పలువురు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో అంధుల పాఠశాలలో ట్రీ ప్లాంటేషన్




కాకినాడ : రోటరీ స్మార్ట్‌సిటీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అచ్చెంపేట సమీపానవున్న అంధుల పాఠశాలలో ట్రీ ప్లాంటేషన్‌తో పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు కురెళ్ళ సూర్యనారాయణ తెలిపారు. ప్రోగ్రామ్ కమిటీ ఛైర్మన్ వాకచర్లరవి స్వీయ పర్యవేక్షణలో నగరపాలక సంస్థ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మిప్రసన్న, సాలగ్రామ సర్వేశ్వరరావు, మణికంఠ, ప్రసాద్, గ్రంధిరాజ, జి. నాగేంద్ర శర్మ ప్రభుతులు వివిధ ఫలపుష్ప నీడనిచ్చే మొక్కలను నాటారు. ఈ పాఠశాలకు చెందిన గ్రౌండ్‌లో పెరిగిపోయిన పిచ్చిమొక్కలను పచ్చగడ్డిని పరిశుభ్రంచేసి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కురెళ్ళ సూర్యనారాయణ మాట్లాడుతూ అంధుల పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రత సేవా కార్యక్రమాన్ని నిర్వహించడంద్వారా పిల్లలకు మంచి వాతావరణాన్ని కల్పించ గలిగామన్న ఆత్మతృప్తి కలిగిందన్నారు. కార్పొరేటర్ లక్ష్మి ప్రసన్న కుమారుడు జన్మదినోత్సవం సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమ నిర్వహణకు రూపకల్పన చేయడం అందరికి స్ఫూర్తిదాయకంగాను మార్గదర్శకంగాను ఉంటుందని కొనియాడారు. రోటరీ స్మార్ట్‌సిటీ క్లబ్ నిర్వహించే ప్రతీ కార్యక్రమంలోనూ సమాజ కాంక్షతోపాటు సభ్యుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపట్టడమే తమ ఆశయమని చెప్పారు.

## ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా బాలికల కన్వీనర్‌గా లక్ష్మి



కాకినాడ :  ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా బాలికల కన్వీనర్‌గా ఎస్.లక్ష్మి ఎంపికయ్యారు. భారత విద్యార్థి ఫెడరేషన్ శనివారం కాకినాడ జగన్నాథపురం అన్నవరం సత్యదేవి మహిళా కళాశాలలో బాలికల నూతన కమిటి ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా కన్వీనర్  లక్ష్మి మాట్లాడుతూ నిర్భయ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలన్నారు. అన్ని కళాశాలలోఈవ్ టీజింగ్,ర్యాగింగ్ నిరోధక కమిటీలు వేయాలన్నారు. మద్యాన్ని, అశ్లీలచిత్రాలను రద్దుచేయాలన్నారు. విద్యార్థినిలకు ప్రత్యేక బడ్జెట్ పెటిపెట్టి అందరికీ విద్యను అందుబాటులోనికి తేవాలన్నారు. ఈ కమిటీలో సుమారు 25 మంది సభ్యులతో కమిటీ వేసారు.కో-కన్వీనర్‌గా డి.రమ్య ఎన్నికయ్యారు. కమిటీసభ్యులుగా జ్యోతి, కామేశ్వరి, హేమ, విజయ, అర్జున్ కుమారి, జీవిత, రమ్మ అనూష, ఉమప్రియ, స్వప్న, అనూష, శివగంగ, నూకరత్నం, కుమారి, జ్యోతి, గంగోత్రి, దేవి, మెర్సీ కుమారి ఎంపికయ్యారు. ఎన్నికల పర్యావేక్షకులుగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు ఆర్.ఈశ్వరరావు, టి.రాజా తదితరులు పాల్గొన్నారు. కమిటీని పలువురు అభినందించారు.

## వార్డుల్లో ఎమ్మెల్యే వాసుపల్లి సుడిగాలి పర్యటన



విశాఖపట్నం: శనివారం వెలంపేట, మేదర్లవీధి, ఉడ్‌యార్డ్ స్ట్రీట్ తదితరు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని, సమస్యలుంటే తనకు వెంటనే తెలియజేయాలన్నారు.

అనంతరం స్థానిక ప్రజలను సమస్య లను అడిగితెలుసుకున్నారు. ప్రజలు సంతృప్తి వ్యక్తంచేయడంతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఫోన్‌చేసి సమస్యలు తెలియజేసినా వెంటనే పరిష్కరిస్తామని వారికి వివరాంచారు.

## ఎస్.ఎఫ్.ఐ. నిరవధిక నిరాహార దీక్షకు వై.యస్.ఆర్.సి.పి.మద్ధతు



విజయనగరం: శనివారం విజయనగరం నియోజక వర్గం వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ నాయకులు అవనాపు విక్రమ్ ఆధ్వర్యంలో ఎస్.ఎఫ్.ఐ.వారు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు వై.యస్.ఆర్.సీపీ మహిళ విభాగం, యువజన విభాగం, విద్యార్థి విభాగం మరియు వై.యస్.ఆర్.సీపీ నాయకులు అందరూ పాల్గొని వారికి సంపూర్ణ మద్దత్తు ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో అవనాపు విక్రమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ విద్య పూర్తిగా అగమ్యగోచరంగా మారింది. కార్పొరేట్ విద్యా సంస్థలకు ఊడిగం చేస్తున్న ప్రభుత్వం విద్యాసంస్థలకు లాభం చేకూర్చేలా వ్యవహరిస్తోంది. విజయనగరంలో 40 ఏళ్లుగా డిగ్రీ కాలేజ్ రాకపోవడానికి ఎంపి అశోక్ గజపతిరాజుకు చెందిన మాన్సాస్ విద్యా సంస్థలే అడ్డంకిగా మారిం ది. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులు మౌళిక సదుపాయాలు లేక, సరైన భవనాలు, సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతుండడం భాదాకరం. విభజన హామీల్లో భాగమైన గిరిజన యూనివర్సిటీ తక్షణమే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. సమస్యలన్నింటినీ వైసిపి అధినేత వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి మరియు వైస్సార్సీపి సీనియరు నాయకులు బొత్స సత్యనారాయణగారి దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి నా వంతు కృషిచేస్తాను అని అవనాపు విక్రమ్ తెలిపారు.  ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సిపి మహిళ విభాగం పట్టణ అద్యక్షురాలు శ్రీమతి గదుల సత్యలత, వైయస్సార్ సీపి మహిళ నాయకులు శ్రీమతి పొట్నూరు పద్మ, శ్రీమతి మంచాల శివాని, శ్రీమతి దుక్క లక్ష్మి, శ్రీమతి కలపర్తి లక్ష్మి, వైయస్సార్ సీపి నాయకులు ముళ్ళ త్రినాధ్, పిలకా శ్రీను, పతివాడ వెంకటరావు, రెడ్డి రామ్ము, బొడ్డు రమణ, యువజన విభాగం నాయకులు రౌతు చంటి, కనుగల రాజా, కరుమజ్జి సాయికుమార్, మొకర దుర్గ, విద్యార్థి విభాగం నాయకులు  నేటిపిల్లి పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

# ముద్దు మురిపాలు



ఆదిత్ అరుణ్, హేబాపటేల్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 24 కిస్సెస్. అయోధ్యకుమార్ కృష్ణంశెట్టి దర్శకుడు. సంజయ్‌రెడ్డి, అనిల్ పిల్లాలతో కలిసి అయోధ్య కుమార్ కృష్ణంశెట్టి నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు.

దర్శకుడు మాట్లాడుతూ ఇదొక బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ. అందుకు తగిన నటీనటులు దొరికారు. ముద్దులు, కౌగిలింతలు అనేవి ఒక ఉత్సవంలా ఉంటుందని ఈ చిత్రంలో చెబుతున్నాం. చాలా ఎమోషన్స్ వుంటాయి. నిజాయితీగా తీసిన చిత్రమిది. సినిమాలో ఏడు పాటలుంటాయి. జోయ్‌బారువ మంచి గీతాల్ని అందించారు. హేబాపటేల్ నటన ఏ స్థాయిలో వుండబోతుందో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. సెప్టెంబర్13న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం అన్నారు. నేను ప్రేమకథలు చేయాలని చాలా రోజులుగా ఎదురుచూస్తున్నాను కానీ ఇంత భిన్నమైన ప్రేమకథ చేస్తానని ఊహించలేదు. నన్ను చిత్రపరిశ్రమకు తీసుకొచ్చిన సంజయ్ ఈ చిత్రాన్ని నిర్మించడం ఆనందంగా వుంది ఆదిత్ అరుణ్ చెప్పాడు.

# చిత్రభాను

## దాసు..ఏంటి సంగతి!



నాగార్జున, నాని కథానాయకులుగా నటిస్తున్న మల్టీస్టారర్‌చిత్రం దేవదాస్. వైజయంతి మూవీస్ పతాకంపై అశ్వినీదత్ నిర్మిస్తున్నారు. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. రష్మిక మందన్నా, ఆకాంక్షసింగ్ కథానాయికలు. శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. నాగార్జున, నాని మందు తాగడానికి సిద్ధమవ్వడం... ఇద్దరికి చెరో పెగ్ కలిపిన నాగార్జున సోడా కావాలా? వాటర్ కావాలా? అని నానిని అడిగేలోపే అతడు ఠక్కున పెగ్గు లేపేయడం..ఆ తర్వాత దాసు ఏంటి సంగతి అంటూ.. నాగార్జున అడిగే మాటలతో టీజర్ ఆద్యంతం సరదాగా అనిపించింది. ఈ సినిమాలో దేవ అనే డాన్‌గా నాగార్జున కనిపిస్తుండగా ఆర్‌ఎంపీ డాక్టర్ దాస్‌గా నాని నటిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఆద్యంతం హాస్యప్రధానంగా సాగే చిత్రమిది. ఒక పాట మినహా చిత్రీకరణ పూర్తయింది.

ఇటీవలే బ్యాంకాక్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. ఫస్ట్‌లుక్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం అని తెలిపారు. నరేష్, బాహుబలి ప్రభాకర్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు చిత్ర తారాగణం.

## జాన్వీ కపూర్.. క్యాట్ వాక్



ధడక్ హీరోయిన్ జాన్వీ కపూర్.. లేక్‌మీ ఫ్యాషన్ షోలో ధగధగలాడింది. క్యూటీ స్టార్ తన ఫస్ట్ క్యాట్‌వాక్‌తో అందర్నీ ఆకట్టుకున్నది. శ్రీదేవి కూతురైన 21 ఏళ్ల జాన్వీ.. తన సిస్టర్స్‌తో షోలో పాల్గొన్నది. ర్యాంప్‌పై జాన్వీ తన డ్రెస్సుతో టాప్‌గా నిలిచింది. డిజైనర్ నచికేత్ బార్వే రూపొందించిన డ్రెస్సులో కళకళలాడింది. ఎంబ్రాయిడరీ బ్లౌజ్, స్కర్ట్‌తో కలర్‌ఫుల్‌గా కనిపించింది. తన డ్రెస్సులో వజ్రాలు కూడా ఆకర్షణీయంగా మెరిశాయి. సింపుల్ మేకప్‌తో చాలా అట్రాక్టివ్‌గా జాన్వీ దర్శనమిచ్చింది.

## తాప్సీ లేకపోతే ఈ సినిమా లేదు!



ఆర్టిస్టులు, టెక్నీషియన్‌ల విలువ ఏంటో తెలియజెప్పే సినిమా ఇది. అన్ని శాఖలకు సంబంధించిన వారు నిబద్ధతతో ఈ చిత్రానికి పనిచేశారు. తాప్సీ లేకపోతే ఈ సినిమా లేదు అన్నారు కోన వెంకట్. ఆయన సమర్పణలో తెరకెక్కిన చిత్రం నీవెవరో... హరినాథ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆది పినిశెట్టి, తాప్సీ, రితికా సింగ్ నాయకా నాయికలుగా నటించారు. ఎంవీవీ సినిమా పతాకంపై ఎంవీవీ సత్యనారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. కోన వెంకట్ మాట్లాడుతూ నా 20 ఏళ్ల సినీ ప్రయాణంలో హరీష్‌శంకర్, బాబీ, గోపీమోహన్, దశరథ్ వంటి మంచి వ్యక్తులను సంపాదించుకున్నాను. నేను నమ్మిన కథలకు 90 శాతం విజయాలు దక్కాయి. ఆ వరుసలో వస్తున్న ఈ చిత్రం గొప్ప సినిమాగా నిలుస్తుందనే నమ్మకముంది. ఇందులో నటించిన ప్రతీ ఒక్కరికీ ఈ సినిమా మైలు రాయిగా నిలుస్తుంది. కష్టం దేవుడితో సమానం అంటారు. అలా మా కష్టం వృథాకాదని నమ్ముతున్నాను అన్నారు. ఆది మాట్లాడుతూ ఈ సినిమా చూసిన ప్రతీ ఒక్కరు తాప్సీ, తులసిల గురించి మాట్లాడతారు. అంతా బాగా వాళ్ల పాత్రలు కుదిరాయి. తాప్సీ చేసుండక పోతే ఈ సినిమాకు ఇంత క్రేజ్ వచ్చుండేది కాదు. 12 ఏళ్ల క్రితం ఒక విచిత్రం సినిమాతో పరిచయమయ్యాను. ఆ తరువాత తమిళంకు వెళ్లిపోయాను. నా కెరీర్‌ని ఎప్పుడూ ఇలా వుండాలని ప్లాన్ చేసుకోలేదు. మా అమ్మ తెలుగు సినిమా ఎప్పుడు చేస్తావని అడుగుతుంటుంది. ఆమెకు ఈ చిత్రం అంకితం అన్నారు. తాప్సీ మాట్లాడుతూ రిలీజ్ ముందు సినిమా గురించి మాట్లాడటం నాకు అలవాటు లేదు. సినిమా ఎలా వుందనేది రేపు ప్రేక్షకులే చెప్పాలి. వారి తీర్పు కోసం ఎదురుచూస్తున్నాను. టీమ్ వర్క్‌తో చేసిన సినిమా ఇది అన్నారు.

ఈ కార్యక్రమంలో రితిక సింగ్, ఎంవీవీ సత్యనారాయణ, బాబీ, గోపీచంద్ మలినేని, రవిశంకర్, తులసి, రాహుల్, కావ్య, వివేక్ కూచీభోట్ల, భరత్ చౌదరి, హరినాథ్, నందినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సొంతగా ఫిల్మ్ స్టూడియో కట్టబోతున్న రామ్ చరణ్?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ త్వరలో సినీ స్టూడియో నిర్మాణానికి ప్లాన్ చేస్తున్నారా? ఇప్పటికే సినీ నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టిన ఆయన మెగా ఫ్యామిలీకి సొంత సినీ స్టూడియో లేని లోటును పూడ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారా? అంటే అవును అనే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ రాష్ట్రంలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. అది జరుగాలంటే ముందుగా ఏపీలో సినీ స్టూడియోల నిర్మాణం జరుగాలి. ఇందులో భాగంగా వైజాగ్, అమరావతిలో ఫిల్మ్ స్టూడియోలు ఏర్పాటు చేసేలా ఫిల్మ్ మేకర్స్‌ను పోత్సహిస్తోంది. ఏపీలో జరిగే సినిమా ఫంక్షన్లకు హాజరయ్యే మంత్రులు గంటా శ్రీనివాసరావు తదితరులు సైతం..... ఆయా సందర్భాల్లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్న సంగతి తెలిసిందే. ఫిల్మ్ స్టూడియోలు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం తరుపున రాయతీలు ఇస్తామనే హామీలు కూడా ఇస్తోంది. వైజాగ్ బీచ్ రోడ్డులో? ఈ నేపథ్యంలో వైజాగ్ బీచ్ రోడ్ ప్రాంతంలో రామ్ చరణ్ సొంత స్టూడియో నిర్మిచేందుకు ప్లాన్ చేస్తున్నారనే వార్తలు తెరపైకి వచ్చాయి. ఈ విషయంలో రామ్ చరణ్ నుండి ఇప్పటి వరకు ఎలాంటి అఫీషియల్ ప్రకటన రాలేదు. గతంలోనూ రామ్ చరణ్ హైదరాబాద్ సమీపంలో స్టూడియో నిర్మాణానికి భూమి కొనుగోలు చేశారని వార్తలు వచ్చాయి.

## కోట్లు కొల్లగొడుతున్న నయనతార.. లేడీ సూపర్‌స్టార్‌గా విశ్వరూపం..

లేడీ సూపర్‌స్టార్ నయనతార టైటిల్ పాత్రధారిగా నెల్సన్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన చిత్రం కో..కో..కోకిల. ఇటీవల తమిళంలో కోలమావు కోకిల పేరుతో విడుదలైన ఈ చిత్రం సెన్సేషనల్ హిట్ టాక్‌తో.. అద్వితీయమైన కలెక్షన్స్‌తో బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుంది. ఈ చిత్రాన్ని తెలుగులో కో..కో..కోకిల పేరుతో ఆగస్ట్ 31న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ... లైకా ప్రొడక్షన్స్ ప్రతినిధి మాట్లాడుతూ - ప్రస్తుతం దక్షిణాది లేడీ సూపర్‌స్టార్‌గా నయనతారగారికి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆమె నటించిన కో కో కోకిల సినిమాకు సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహర్‌తో పాటు స్టార్ డైరెక్టర్ శంకర్, సూపర్‌స్టార్ రజనీకాంత్ మా సినిమా చూసి అభినందించారు. వారి అభినందనలు మాకెంతో ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఓ సాధారణమైన అమ్మాయి.. ఓ స్మగ్లింగ్ గ్యాంగ్ చేతిలో అనుకోకుండా చిక్కుకుపోతుంది. అటువంటి విపత్కర పరిస్థితుల నుండి ఆమె ఎలా బయటపడిందనేదే పాయింట్‌ను డైరెక్టర్ నెల్సన్ ఆసక్తికరంగా తెరకెక్కించారు. కో..కో..కోకిల సినిమా తమిళంలో తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుంది. యోగిబాబు కామెడీ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానుంది. శివకుమార్ విజయన్ సినిమాటోగ్రఫీ .. అనిరుధ్ రవిచంద్రన్ మ్యూజిక్.. నెల్సన్ టేకింగ్.. నయనతార నటన సినిమాకు పెద్ద ఎసెట్‌గా నిలిచాయి. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 31న తెలుగులో గ్రాండ్ రిలీజ్ చేస్తున్నాం అన్నారు. నయనతార, యోగిబాబు, శరణ్య పొన్‌వన్నన్ తారాగణంగా నటించిన ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, కెమెరా: శివకుమార్ విజయన్, నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, దర్శకత్వం: నెల్సన్.



# ఆత్మీయ బంధం రక్షా బంధన్..



హిందు సంప్రదాయ పండుగల్లో బంధాలను, బంధుత్వాలను...అన్నా చెల్లెళ్ల...అక్క...తమ్ముళ్ల తను, ప్రేమానురాగాలను చాటిచెప్పేది రాఖీ పండుగ ఒక్కటే. అంతటి పవిత్రమైన, ప్రాధాన్యత కలిగిన రాఖీ పౌర్ణమిని శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున జరుపుకోవడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అన్నా చెల్లెలు, అక్కా తమ్ము డు ఇలా చిన్నా పెద్ద అనే తారతామ్యం లేకుండా ఆప్యాయతలను పెంచేది రాఖీ పండుగే... సమాజంలోని సంబంధ బాంధవ్యాలను రక్షించేది, అనుబంధం, ఆప్యాయతలకు మారుపేరుగా నిలిచి, బంధువుల మధ్య సత్సంబంధాలను మెరుగుపరుస్తుంది. సోదర సోదరిమణుల రక్త సంబంధాన్ని కలకాలం నిలిపేది ఈ రక్షాబంధన్.

ఈ పండుగ రోజున అక్కాచెలెళ్లు అన్నాదమ్ములకు రాఖీలను కట్టి... వారిపై ఉన్న ఆత్మీయతను చాటిచెబుతారు. రాఖీని కట్టుకున్న సోదరులు బహుమతులతో తమ ప్రేమను చాటుతారు.

రక్షా బంధనమనేది కేవలం అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు కట్టుకునేది కాదు.

రక్షాబంధనం ద్వారా రక్ష కల్పించాలనే ప్రతిజ్ఞ అత్మీయులకు భరోసా కల్పించడం కోసం అని ధర్మశాస్త్రం చెబుతోంది. రాజవంశాల నుంచే ఈ పండుగ ప్రారంభమైనట్లు పురాణాలు చెబుతున్నాయి. రాజవంశీకులకు ఇబ్బందులు, ప్రమాదాలు కలుగుతాయానే కారణంగా, వాటి నుంచి రక్షణ పొందడానికి కట్టుకునే ఆనవాయితీ నుంచి ఈ రక్షాబంధనం వచ్చినట్లు తెలుస్తోంది. పురాణ కాలంలో రాజులు యుద్ధాలకువెళ్లే ముందు, ఏదైనా కార్యం తలపెట్టే ముందు రక్షను కట్టుకొని ఆ తర్వాత కార్యాలను మొదలుపెట్టి గెలుపొందేవారు. రాఖీ పౌర్ణమీ రోజు కట్టే రక్షలో ఆసామాన్యమైన విష్ణుశక్తి ఉంటుందన్నది ప్రజల ప్రగాఢ విశ్వాసం. నేటి యుగంలో అన్నాచెల్లెలు, అక్కా తమ్ముళ్లు మాత్రమే రాఖీలను కట్టుకుంటున్నారు.

పూర్వకాలంలో భర్తకి భార్య రక్షణ కోసం రాఖీని కట్టేది. దేవదానవ యుద్ధంలో ఇంద్రుడికి విజయం కలగాలని శచీదేవి రక్ష కడుతుంది.

చరిత్ర విషయానికోస్తే పురుషోత్తముడితో తలపడటానికి సిద్ధంగా ఉన్న అలెగ్జాండర్, విషయం తెలుసుకున్న అలెగ్జాండర్ భార్య రుక్సానా బేగం, పురుషోత్తముడి ఆశ్రయం కోరుతుంది.



పురుషోత్తముడికి సోదరి లేదన్న విషయాన్ని తెలుసుకున్న ఆమె, శ్రావణ పౌర్ణమి రోజున పురుషోత్తమునికి రాఖీ కడుతుంది. దీనికి బహుమానంగా తన భర్త ప్రాణాలను కాపాడమని కోరుతుంది. తన చేతికి ఉన్న రక్ష కారణంగా అలెగ్జాండర్‌ను చంపకుండా వదిలేస్తాడు పురుషోత్తముడు. కుల, మతాలకు అతీతంగా అనాటి కాలంలోనే అంతటి విశిష్టతను సంపాదించుకున్న రాఖీ పండుగను నేటి యుగంలోనూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకుంటారు.



నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో జిల్లా జాతీయ రహదారుల ప్రాజక్టు డైరెక్టర్ జె. సిహెచ్. వెంకటరత్నం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ నేషనల్ హైవే పై ఉన్న గోతులు వెంటనే పూడ్చాలని, గ్రామాలకు అనుకోని ఉన్న ఎప్రోచ్ రోడ్లు ను వెంటనే నిర్మించాలని వాటిని సుందరంగా తీర్చాలని పిడీకి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## సెంట్రల్ జైల్ ఖైదీలకు
# కళా హాస్పిటల్ ఉచిత వైద్యసేవలు





విశాఖపట్నం: నగరంలో ప్రముఖ వైద్యశాల ఆయన కళా హాస్పిటల్ అధ్యర్యంలో విశాఖపట్నం సెంట్రల్ జైల్ లో ఖైదీలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు . వైద్య రంగంలో నిష్ణతులైన 12 మంది డాక్టర్స్ ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, జనరల్ చెకప్ , బ్లడ్ టెస్టులు, చర్మవ్యాధులు, మొదలగు అన్నిరకాల వ్యాధి నిర్ధరణ పరీక్షలు నిర్వహించారు.అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి మాట్లాడుతూ జీవితంలో వివిధ సందర్భంల్లో క్షణిక ఆవేశం లో చేసిన చిన్న చిన్న తప్పులుల వలన మీరు అందరూ శిక్ష లు అనుభవిస్తున్నారు . శిక్ష కాలంలో మనష్టపపం చెంది ఉండాలన్నారు . ప్రతివక్కరు ఆరోగ్యం పై శ్రద్ధవహించి అప్పటికప్పుడు ఆరోగ్య సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు .అనంతరం డాక్టర్ పీవీ రమణమూర్తి కి జైల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరిటెండెంట్ రాహుల్ , డిప్యూటీ సూపరిటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.






# డ్రైనేజి వ్యవస్థ ను మెరుగుపరచాలి



## వైఎస్సార్‌సిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు

విశాఖసిటీ: జీవీఎంసీ 34 వార్డు లో తాటిచెట్లపాలెం లో రజకల కొలనీ,ఎఎస్ఆర్ నగర, తారకరామానగర్, గణేష్ నగర్ తదితర ఏరియా వైఎస్సార్‌సిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శనివారం పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఈ ఏరియా లో ముఖ్యము గా భూగర్భ కాల్వలు, మరుగు నీరు , సానిటరీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని వీటి కోసం సంబంధించిన అధికారుల తో మాట్లాడి మెరుగుపరిచేందు కృషి చేస్తానని హామీ ఇచ్చారు అలాగే త్వరలో మన నగరంలో జరగనున్న ప్రజాసంకల్ప యాత్ర విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ వచ్చి పాలు పంచుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో 34 వ వార్డు వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు పైడి రమణ, హరి పట్నాయక్, రామారావు, నానిబాబు, సన్నీ, అప్పారావు, గణపతి రావు, గోపాలరావు, ఆదిలక్ష్మి, ఎం.రామారావు, తది తరులు పాల్గొన్నారు.


**LOANS / లోన్స్**

**HAPPY HOMES**

We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,

**94902 33750**


## ఆసియాడ్:
# క్వార్టర్స్‌కు సైనా, సింధు



జకార్తా: భారత అగ్రశ్రేణి మహిళా షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధు జోరుమీదున్నారు. ఆసియా క్రీడల్లో మహిళల బ్యాడ్మింటన్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. స్థానిక క్రీడాకారిణి ఫిత్రియానితో జరిగిన రెండో రౌండ్ పోరులో సైనా 21-6, 21-14 తేడాతో విజయం సాధించింది. కేవలం అరగంటలోనే ఆమె ప్రత్యర్థిని చిత్తుచేసింది. ఇండోనేషియాకే చెందిన మరో షట్లర్ జార్జియా మారిస్కా తున్‌జంగ్‌ను పీవీ సింధు 21-12, 21-15 చిత్తుగా ఓడించింది. కామన్వెల్త్ క్రీడల్లో రజతం సాధించిన సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జోడీ పురుషుల డబుల్స్ రెండో రౌండ్ దాటలేకపోయింది. కొరియా ద్వయం చోయి సాల్గీ, మిన్ హ్యుక్ కాంగ్‌తో జరిగిన హెూరాహెూరీ పోరులో 17-21, 21-19, 17-21 తేడాతో ఓటమి చవిచూసింది.


**అమృతమూర్తికి అశ్రునివాళి**



జననం: 20-5-1991
మరణ:: 26-8-2017

ప్రేమ అప్యాయతానురాగాలు మాకు పంచి,
కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి,
సమాజంలో సమున్నత స్థానానికి వెదికిన
“ కాళ్ల సత్యదుర్గ మల్లేష్” (B.com, IERT)
గారి మృతికి చింతిస్తూ...
ప్రధమ వర్ధంతి సందర్భంగా వారి పవిత్రాత్మకు శాంతి
కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

తండ్రి: కాళ్ల శేష అవతారం (నాగేశ్వరరావు)
తల్లి: కాళ్ల అనంతలక్ష్మి
తమ్ముడు: కాళ్ల వీరవెంకట రమేష్ మరియు
కుటుంబ సభ్యులు

అడ్రస్సు: కాళ్ల శేష అవతారం, డోర్ నెం. 3-10-002, కాళ్ల వారి సందు,
త్యాగరాజువారి వీధి, యానాం


# ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం
## మూడు అంతస్తుల భవనంలో మంటలు



ఢిల్లీ: పశ్చిమ ఢిల్లీలోని నన్‌గ్లోయిస్ నరేష్ పార్క్ ప్రాంతంలోని ఓ ప్లాస్టిక్ బ్యాగుల తయారీ కర్మాగారంలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మూడు అంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన 25 ఫైరింజన్‌లతో ఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు వెల్లడించారు. మంటల కారణంగా ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. ప్రమాదానికి గల కారణం తెలియాల్సి ఉంది.






VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com